హైదరాబాద్ వార్త



## చిన్నారులు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం బాగుంటుంది: జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



చిన్నారులకు టీకా వేసి ప్రారంభిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తదితరులు

హైదరాబాద్, ఆగస్టు 7,ప్రభాతవార్త: చిన్నారులు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం బాగుటుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం బంజారాహిల్స్ యుపిహెచ్‌సి భోలానగర్‌లో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఇంటెన్సిఫైడ్ మిషన్ ఇంద్రధనస్సులో భాగంగా చిన్నారులకు టీకాలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈవ్యాక్సినేషన్ సోమవారం నుంచి 12వ తేదీ వరకు మొదటిరౌండ్, సెప్టెంబర్ 11నుంచి 16 వరకు రెండవ రౌండ్, అక్టోబర్ 9నుంచి 14వరకు మూడవ రౌండ్ ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో గర్భిణీలకు, 5ఏళ్లలోపు చిన్నారులకు టీకా వేయడం జరుగుతుందన్నారు. అంగన్వాడీ సెంటర్, ప్రభుత్వ దవాఖానాల్లో 12రకాల టీకాలు ఉచితంగా వేస్తారని జిల్లాలో మొత్తం 1262 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాల్లో వందశాతం టీకాలు తీసుకునే విధంగా కృషి చేయాలని ఈటీకా కార్యక్రమంపై ఆశా వర్కర్లతో కాలనీలో ప్రతి ఇంటిని సందర్శించి వారికి ఈటీకా అవశ్యకతను వివరించాలన్నారు. ఈకార్యక్రమానికి స్థానిక ప్రజా ప్రతినిధులు, మతపెద్దలు సహకారం తీసుకుని విజయవంతం చేయాలన్నారు.

# నేల తల్లి ఒడిలోకి ఎర్రపాట

## తరలివచ్చిన అభిమాన జన తరంగం ✶ అశ్రునయనాల నడుమ అంతిమయాత్ర

**అంతిమయాత్రకు భారీగా తరలివచ్చిన కళాకారులు, అభిమానులు**

**మహాబోధి విద్యాలయం ఆవరణలో అధికారిక లాంఛనాలతో గద్దర్ అంత్యక్రియలు**



గద్దర్ అంతిమయాత్రలో పాల్గొన్న ప్రజానికం, (ఇన్‌సెట్‌లో గద్దర్ పార్ధీవదేహం) ప్రజా గాయకుడికి నివాళ్లు అర్పిస్తున్న నగర మేయర్ గద్వాల విజయలక్ష్మీ, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 7 ప్రభాతవార్త : పాటలతో ప్రజల్లో చైతన్య స్ఫూర్తిని రగిలించిన ప్రజా యుద్ధనౌక, ప్రజాకవి గద్దర్‌కు కన్నీటి వీడ్కోలు పలికారు. అంతిమయాత్ర ముందు కళాకారులు గద్దర్ అమర్ రహే అంటూ నినాదాలు చేస్తూ పాటలతో ఆయనను గుర్తు చేసుకున్నారు.గద్దర్ పార్థివదేహానికి పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు నివాళులు అర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాలను గుర్తుచేసుకుని కన్నీటి పర్యంతం అయ్యారు.అంతిమయాత్రలో కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, బిఎస్పి, వామపక్ష పార్టీలకు చెందిన నాయకులతో పాటు ఆయన అభిమానులు, కళాకారులు భారీగా పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. సోమవారం సాయంత్రం అల్వాల్‌లోని భూదేవి నగర్‌లోని మహాభోధి విద్యాలయంలో గద్దర్ అంత్యక్రియలు నిర్వహించారు. ఎల్బీస్టేడియం నుండి ఆయన అంతిమయాత్ర కొనసాగింది. గన్‌పార్కు, అసెంబ్లీ, నెక్లెస్‌రోడ్‌లోని అంబేద్కర్ విగ్రహం, అమరవీరుల స్మారక స్థూపం, ట్యాంక్ బండ్, జేబీఎస్, తిరుమలగిరి మీదుగా అల్వాల్ చేరుకుంది. అంతిమయాత్ర సుమారు ఏడు గంటల పాటు జరిగింది. గద్దర్ అంతిమ యాత్ర వాహనానికి జై బీం జెండాలతో పాటు బుద్ధిడి పంచశీల జెండాలను ఏర్పాటు చేశారు.గద్దర్ అంతిమయాత్రతో దారిపోడవున రోడ్లన్ని కిక్కిరిసిపోయాయి. మరోవైపు అల్వాల్‌లోని గద్దర్ నివాసం వద్ద సిఎం కెసిఆర్ నివాళులు అర్పించారు. గద్దర్ ఇంటికి వచ్చిన కెసిఆర్ ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢక సానుభూతి తెలిపారు. కెసిఆర్ వెంట మంత్రి హరీష్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, పలువురు ఎమ్మెల్యేలు ఉన్నారు. ఎల్బీస్టేడియంలో గద్దర్ భౌతికకాయాన్ని సందర్శించి పలువురు నివాళులర్పించారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి.రమణ, మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, సబితా ఇంద్రారెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, మహబూద్‌అలీ, నిరంజన్‌రెడ్డి, ఎపి మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జానారెడ్డి, ఎమ్మెల్యేలు రఘునందన్‌రావు, సీతక్క, ఎమ్మెల్యే రాజయ్య, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, మాజీ మండలి చైర్మన్ స్వామిగౌడ్, నగర మేయర్ గద్వాల విజయలక్ష్మీ, సినీ ప్రముఖులు మంచు మోహన్‌బాబు, మనోజ్, కొణిదెల నాగబాబు, నిహారిక, అలీ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, తెలుగుదేశం పార్టీ నేత పరిటాల శ్రీరామ్, టిఎస్ఆర్టీసి ఎండి సజ్జనార్, ప్రొఫెసర్ కోదండరామ్ తదితరులు అంజలి ఘటించారు.

**పోలీసుల ప్రత్యేక ఫోకస్**

గద్దర్ అంతిమయాత్రపై పోలీసులు ప్రత్యేక ఫోకస్ పెటాత్టరు. గద్దర్ అంత్యక్రియల సందర్భంగా మాజీ మావోయిస్టులు, సానుభూతిపరులు పాల్గొనే అవకాశం ఉన్న నేపథ్యంలో అంతిమయాత్రపై పోలీసులు నిఘా వర్గాలను రంగంలోకి దింగాయి. ఇందుకోసం సిసి కెమెరా మౌంటెడ్ వాహనాన్ని కూడా వినియోగించారు. గద్దర్ అంతిమయాత్ర ఎల్బీస్టేడియం నుంచి అల్వాల్ వరకు సాగుతున్న నేపథ్యంలో వేలాది మంది అభిమానులు అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వచ్చిన ఎవారి కదలికలను పోలీసులు గమనిస్తువచ్చారు.గద్దర్‌తో ఉద్యమంలో కలిసి పనిచేసిన చాలా మందిపై కేసులు నమోదై ఉన్నాయి. కొంతమంది జైలుకు వెళ్లి రాగా మరికొంత మంది అజ్ఞాతంలో ఉన్నారు. అలాంటి వారిలో చాలా మంది ఆయనను కడసారి చూసేందుకు అంతిమయాత్రలో పాల్గొనే అఈవకాశం ఉందన్న ఇంటెలిజెన్స్ సమాచారం నేపథ్యంలో అంతిమయాత్రపై నిఘా పెట్టారు పోలీసులు. సుమారు 12 కిలోమీటర్ల మేరకు సాగిన అంతిమయాత్ర సందర్భంగా వ్యక్తుల కదలికలను మౌంటెడ్ సీసీ కెమెరా వెహికల్ ద్వారా గమనించారు. ఇక మఫ్టీలో ఉన్న పోలీసులు సైతం గద్దర్ అంతిమయాత్ర సాధారణ జనంతో కలియ తిరుగుతూ నక్సలైట్లను లేదా సానుభూతిపరులను గుర్తించేందుకు ప్రయత్నించారు.

## ద్విచక్రవాహనదారుడిపై తెగి పడిన విద్యుత్ తీగ

**అక్కడికక్కడే దుర్మరణం**



మృతిచెందిన సత్యనారాయణరెడ్డి

దుండిగల్, ఆగస్టు 7 ప్రభాతవార్త : ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తిపై ప్రమాదవశాత్తు విద్యుత్‌తీగ తెగిపడడంతో విద్యుత్‌ఘాతానికి గురై అక్కడికక్కడే దుర్మరణం చెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా, ఇల్లంత కుంట ప్రాంతానికి చెందిన సత్యనారాయణరెడ్డి(57) నగరానికి వచ్చి కుటుంసభ్యులతో కలిసి దుండిగల్ మున్సిపాలిటీ, మల్లంపేటలోని డ్రీమ్‌వ్యాలీలో నివాసం ఉంటూ ఆకాష్‌లేఅవుట్‌లో వాటర్‌ప్లాంట్ నిర్వహిస్తున్నాడు. రోజుమాదిరిగానే సోమవారం ఉదయం 7గంటల ప్రాంతంలో సత్యనారాయణరెడ్డి తన ద్విచక్రవాహనంపై వాటర్‌ప్లాంట్ వద్దకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని విద్యుత్‌తీగ తెగి ఆయన మెడపై పడడంతో విద్యుత్‌ఘాతానికి గురై సృహకోల్పోయాడు. గమనించిన స్థానికులు హుటాహుటినా బాచుపల్లిలోని మమతా వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యలు అప్పటికే ఆయన మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుని కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

**మరో సంఘనటలో..** గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...దుండిగల్ ఔటర్‌రింగురోడ్డు సర్వీస్ రోడ్డు పక్కన తీవ్రగాయాలతో వ్యక్తి మృతిచెంది ఉండడాన్ని గమనించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీ సులు మృతదేహాన్ని పరిశీలించగా మృతుడి లోధుస్తులు మత్రమే ధరించడంతో మతిస్థిమితం సరిగా లేకపోవచ్చునని, ఒంటిపై తీవ్రగాయాలు ఉండడంతో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టి ఉండవచ్చునని ప్రాథమికంగా భావిస్తున్నారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించ లేదు. పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీకి తరలించారు.

## నగర కలెక్టర్‌ను కలిసిన గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్



సికింద్రాబాద్, ఆగస్టు 7 ప్రభాతవార్త : హైద్రాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి (గాంధీఆస్పత్రి హెచ్‌డీఎస్ కమిటీ చైర్మన్)ను సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి వైద్య బృందం కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. గాంధీ ఆస్పత్రి అభివృద్ధి, అందిస్తున్న వైద్యసేవలు, ఇతర సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. పరిష్కరించాల్సి సమస్యలను గురించి చర్చించారు. వైద్యులు తెలిపిన సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే గాంధీఆస్పత్రికి వచ్చి పరిశీలిస్తానని కలెక్టర్ తెలిపినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యాక్రమంలో గాంధీఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు ఇతర వైద్యులు పాల్గొన్నారు.

## మాణికేశ్వరీనగర్ బస్తీలో హాస్పిటల్ ఏర్పాటుకు కృషి చేస్తాం

**డిప్యూటీ స్పీకర్ పద్మారావు**



డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్‌ను సన్మానిస్తున్న ఆలకుంట హరి

తార్నాక, ఆగస్టు 7 ప్రభాతవార్త: మాణికేశ్వరీనగర్ బస్తీలో హాస్పిటల్ ఏర్పాటుకు కృషి చేస్తామని నగర డిప్యూటీ స్పీకర్ పద్మారావు పేర్కొన్నారు. ఆసుపత్రికోసం గత 126 రోజులుగా బస్తీవాసులు చేస్తున్న రిలే నిరహార దీక్షా శిభిరానికి ఆయన హాజరై దీక్షలో పాల్గొన్న వారికి నిమ్మ రసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు ఆలకుంట హరి పద్మారావుగౌడ్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పద్మారావుగౌడ్ మాట్లాడుతూ ఆసుపత్రి ఏర్పాటుకు తన వంతు పూర్తి సహాయ సహకారాలు ఉంటాయని ఎంత సమయం అనేది చెప్పలేమని కాని ఏర్పాటుకు మాత్రం ఖచ్చితంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గండికోట విజయ్‌కుమార్, వేముల శ్రీనివాస్, ఒర్సు శేఖర్, కృష్ణ, ఆలకకుంట లింగయ్య, రవితేజ, బస్తీవాసులు పాల్గొన్నారు.

### బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో

## యువకుని అనుమానాస్పద మృతి

యూసుఫ్‌గూడ, ఆగస్టు 7, ప్రభాతవార్త : ప్రియురాలికి పిజ్జా ఇవ్వడానికి వచ్చి టెర్రస్‌పై ముచ్చట పెడుతుండగా ప్రియురాలి తండ్రి అలికిడి విని భయపడి ఫ్లోరు బిల్డింగ్ నుంచి కిందకు దూకి గాయాలపాలై ప్రియుడు చనిపోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహమ్మద్ షోయాబ్ బోరబండలోని ఓ బేకరిలో పనిచేసేవాడు. అదే ప్రాంతంలో నివసించే ఒక యువతి పరిచయమయ్యింది. ఆ పరిచయాన్ని ఆసరాగా తీసుకుని పిజ్జా తీసుకుని రమ్మని చెప్పినందుకు అతను అర్ధరాత్రి పిజ్జా ఇవ్వడానికి ఆయువతి ఇంటికి వెళ్ళి పైన టెర్రస్‌పై మాట్లాడుతుండగా ఆమ్మాయి తండ్రి తన కూతురు ఏమయిందోనని వెతుకుతూ పైన టెర్రస్‌కు వెళ్ళగా అతనిని చూసి భయపడి సోయాబ్ నాలుగవ అంతస్తు బిల్డింగ్ నుంచి దూకి గాయాలపాలయ్యాడు. అతనిని వెంటనే స్తానికులు బోరబండ పోలీసులు చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతను మరణించాడని ఈవిషయంపై సోయాబ్ తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా అనుమానస్పద మృతి కేసులో నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నారు.

## వచ్చేనెల పెద్దపల్లిలో "వెనబడిన కులాల భారీబహిరంగ సభ "

**అఖిలభారత యాదవ మహాసభ, సమాజ్ వాదీ పార్టీ**

హైదరాబాద్, ఆగస్టు 7,ప్రభాతవార్త: అఖిలభారత యాదవ మహాసభ, సమాజ్ వాదీ పార్టీ -తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో సెప్టెంబర్ నెలలో పెద్దపల్లి భరీ బహిరంగసభను ఏర్పాటు చేయనున్నట్లు సమాజ్‌వాదిపార్టీ రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ ఎస్.సింహాద్రి, అఖిలభారత యాదవ మహాసభ యువజనవిభాగం రాష్ట్ర అధ్యక్షులు ఐలబోయిన రమేష్‌యాదవ్ తెలిపారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బిసిల కులగణన జరగాగాలని ఈభారీ బహిరంగ సభను నిర్వహిస్తుమన్నారు. దీనికి సమాజ్‌వాదీ పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్‌యాదవ్ ముఖ్యఅతిధిగా హాజరుకానున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో సమాజ్‌వాదీ పార్టీ ప్రధాన కార్యదర్శి అకనకల బాబుగౌడ్, ఉపాధ్యక్షులు మారం తిరుపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

నాంపల్లి, ఆగస్టు 7 ప్రభాతవార్త : జీఆర్‌పి హైదరాబాద్ (నాంపల్లి) రైల్వే పోలీసుస్టేషన్ పరిధిలోని చందానగర్ లింగంపల్లి రైల్వేస్టేషన్ల మధ్య ఒక గుర్తుతెలియని రైలు ఢీకొని ఒక గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. జీఆర్‌పి హెచ్‌కానిస్టేబుల్ బి.శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం 6 ఆదివారం రాత్రి 11.30గంటల సమయంలో చందానగర్ లింగంపల్లి రైల్వేస్టేషన్ మధ్య కిలోమీటర్లు నంబరు 162/7-9 అప్‌లైన్‌లో వేగంగా వస్తున్న రైలును గమనించక పట్టాలుదాటుతుండగా ఆ రైలుఢీకొని గుర్తుతెలియని వ్యక్తి తీవ్రగాయాలు, రక్తశ్రావంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి వయస్సు 40-45 సంవత్సరాలు. ఎత్తు 5.5 అడుగులు, కోలముఖం, నల్లజుట్టు. ఎడమవైపు పక్కటెముకలపై పుట్టుమచ్చ ఉంది. మృతుడు తెలుగు మెరూన్‌కలర్ ఫుల్‌షర్టు, గోధుమరంగు ప్యాంటు, కాఫీకలర్ టీషర్టు, నల్ల రంగు చెప్పులు ధరించి ఉన్నారు. వైద్యుల పరిశీలనాంతరం ఆస్పత్రిలోని మార్చులో భద్రపరిచినట్లు, సంబంధీకులు పూర్తి వివరాలను హైదరాబాద్ (నాంపల్లి) జీఆర్‌పి రైల్వే పోలీసుస్టేషన్ ఫోన్ నంబరు 040-23202238 లేదా హెచ్‌కానిస్టేబుల్ బి.శ్రీనివాసులు మొబైల్ నంబరు 9848349544లో సంప్రదించవచ్చునని తెలిపారు.

## బీసీలకు రాజ్యాంగ హక్కులు కల్పించాలి

**జాతీయ బీసీ సంక్షేమ సంఘం**

**కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీని కలిసిన బీసీ నేతలు**

హైదరాబాద్, ఆగస్టు 7 ప్రభాతవార్త: బీసీలకు రాజ్యాంగ హక్కులను కల్పించాని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జసత్యం కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. సోమవారం ఢిల్లీలో కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియాగాంధీని కలిసి బీసీ డిమాండ్లపై మద్దతు ఇవ్వాలని పలువురు బీసీ నేతలు కోరారు. బీసీ సమస్యలపై తమ పార్టీ ఎల్లప్పుడు బీసీల పక్షాన ముందుంటుందని ఆమె చెప్పినట్లు వివరించారు. ఈ సందర్భంగా గుజ్జ సత్యం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టి అసెంబ్లీ, చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్‌లను 25 శాతం నుంచి 50శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్‌లు ప్రవేశపెట్టాలని, క్రిమిలే యర్‌ను రద్దు చేయాలనని, బీసీలు బిజెపిని తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డా యని హెచ్చరించారు. కులగణన అంశంపై ఇప్పటికే ఏడు రాష్ట్రాలలో అసెంబ్లీలో తీర్మాణాలు చేశాయని,ప్రధానమంత్రి మోదీ బీసీ అయి ఉండి బీసీలకే తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. సోనియాగాంధీని కలిసిన వారిలో సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి భాషయ్య, జిలపల్లి అంజి, పలు రాష్ట్రాల బీసీ నాయకులు పాల్గొన్నారు.

## వస్త్రాల మార్కెట్లలో పటిష్టమైన బందోబస్తు

**చార్మినార్ ఎసిపి రుద్ర భాస్కర్**



సమావేశంలో పాల్గొన్న చార్మినార్ ఎసిపి రుద్ర భాస్కర్,చార్మినార్ ట్రాఫిక్ ఎసిపి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

చార్మినార్,ఆగష్టు 7 ప్రభాతవార్త : పాతబస్తీలోని వస్త్రాల మార్కెట్లలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తామని చార్మినార్ ఎసిపి రుద్ర భాస్కర్ తెలిపారు.ది హైదరాబాద్ కట్‌పీస్ క్లాథ్ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో సోమవారం పటేల్ మార్కెట్‌తో పాటు పలు వస్త్రాల మార్కెట్లకు చెందిన బట్టల వ్యాపారులతో జరిగిన సమావేశంలో రుద్ర భాస్కర్‌తో పాటు చార్మినార్ ట్రాఫిక్ ఎసిపి చంద్రశేఖర్‌రెడ్డిలు పాల్గొన్నారు.పాతబస్తీలోని వస్త్రాల మార్కెట్లలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండ పోలీస్ పెట్రోలింగ్ ఏర్పాటు చేయాలని,అదే విధంగా ట్రాఫిక్ సమస్య లేకుండ మార్కెట్లలో ట్రాఫిక్ పోలీసులను ఏర్పాటు చేయాలని వస్త్రాల వ్యాపారులు సమావేశంలో కోరారు. ఈ సందర్భంగా చార్మినార్ ఎసిపి రుద్ర భాస్కర్ మాట్లాడుతూ వస్త్రాల మార్కెట్లలో దొంగ తనాలు జరగకుండ పోలీస్ పెట్రోలింగ్‌తో పాటు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో చార్మినార్ పోలీస్ స్టేషన్ సిఐ చంద్రశేఖర్,చార్మినార్ ట్రాఫిక్ సిఐ ఖాదర్,చార్మినార్ పోలీస్ స్టేషన్ డిఐ బాలస్వామి,ది హైదరాబాద్ కట్‌పీస్ క్లాథ్ మర్చంట్స్ అసోసియేషఫ్ అధ్యక్షులు అజయ్ చినానియా,ప్రతినిధులు ఎం.సునీల్ కుమార్ అగర్వాల్, రవీందర్, టి.సునీల్,పంకజ్ కుమార్ అగర్వాల్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

## తెలంగాణలో మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వమే : కేటిఆర్

**ఉప్పల్‌లో చేనేత శాశ్వత భవన నిర్మాణానికి భూమి పూజ**



ఉప్పల్‌లో చేనేత శాశ్వత భవనం పూజ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర మున్సిపల్ మంత్రి కేటిఆర్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే బేతి

ఉప్పల్, ఆగస్టు 7 ప్రభాతవార్త : తెలంగాణలో మళ్లీ బిఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని, తమ హయాంలోనే ప్రజలకు మేలు జరుగుతుందని రాష్ట్ర మున్సిపల్‌శాఖ మంత్రి కె.తారక రామారావు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఉప్పల్ మినీ శిల్పారామం వద్ద చేనేత శాశ్వత భవన నిర్మాణానికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ ఎల్. రమణ, ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, బిఆర్ఎస్ సీనియర్ నేత బండారి లక్ష్మారెడ్డి, పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, టెక్స్‌టైల్ అండ్ హ్యాండ్‌లూమ్ సెక్రటరీ డా.జ్యోతి బుద్ద ప్రకాష్, చేనేత, జౌళి శాఖ డైరెక్టర్ డా.అలుగు వర్షిణి, జాయింట్ డైరెక్టర్ యాదగిరి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో మంత్రి కేటిఆర్ విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో తిరిగి బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని తెలిపారు. ఉప్పల్, మేడిపల్లి మండల పరిధిలోని జర్నలిస్టుల సమస్యలపై స్పందించిన కేటిఆర్ జర్నలిస్టుల ఇళ్ల పట్టాల సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న చేనేత, జౌళి శాఖ భవనం, మ్యూజియం ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. టెక్స్‌టైల్ అండ్ హ్యాండ్‌లూమ్ సెక్రటరీ డా.బుద్ద ప్రకాష్ జ్యోతి, చేనేత, జౌళి శాఖ డైరెక్టర్ డా.అలుగు వర్షిణి, జాయింట్ డైరెక్టర్ యాదగిరి మాట్లాడుతూ ఉప్పల్ మినీ శిల్పారామం వద్ద రూ.65 కోట్ల వ్యయంతో 3వేల గజాలలో చేనేత, జౌళి శాఖ శాశ్వత భవనం నిర్మిస్తున్నామని, ఇందులో 2500 గజాల్లో ఆర్ట్స్,హాండ్యులూమ్ భవనం, మరో 500 గజాల్లో హ్యాండ్లూమ్ మ్యూజియం ఏర్పాటు చేస్తామని తెలిపారు. రూ.50 కోట్ల వ్యయంతో పర్మనెంట్ కన్వెన్షన్ సెంటర్ హాల్, మరో రూ.15 కోట్లతో మ్యూజియం నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో బడ్జెట్‌లో చేనేతకు రూ.1000కోట్లు కేటాయించాలి

చిక్కడపల్లి, ఆగస్టు 7 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం చేనేత రంగంపై జీరో జీఎస్టీని వెంటనే ప్రకటించాలని చేనేతవర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాస్ డిమాండ్‌చేశారు. వెంటనే రాష్ట్రంలో చేనేతవర్గాలకు రూ.10లక్షల చేనేతబంధును ప్రవేశపెట్టాలన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో వేదిక రాష్ట్ర కార్యాలయంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చిక్కా దేవదాస్ మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా కరోనా కష్టకాలంలో చేనేతరంగం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదరణ లేక చేనేత కార్మికులు అనేక ఇబ్బందులకు గురై అనారోగ్యం, అప్పులపాలై లాక్‌డౌన్ సమయంలో దుర్భర నిస్సహాయస్థితిలో ఆకలి చావులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ అధ్యక్షుడు కత్తుల సుదర్శన్‌రావు, యాదాద్రి జిల్లా పద్మశాలి నాయకులు రచ్చ శ్రీనివాస్, చేనేత నాయకులు పులగం చక్రపాణి, పాసికంటి నాగమూరినత, చేనేత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## అత్తాపూర్ ఎస్ఆర్ డిజి పాఠశాలకు నోటీసులు

మైలార్‌దేవ్‌పల్లి, ఆగష్టు 7 ప్రభాతవార్త : రంగారెడ్డి జిల్లా అత్తాపూర్‌లోని ఎస్ఆర్ డిజి స్కూల్‌పై విద్యాశాఖ అధికారులు ఉక్కుపాదం మోపారు. పాఠశాలలో చదువుచున్న ఎనిమిదివ తరగతి విద్యార్థినీని అదే పాఠశాలకు చెందిన పిఇటి ఉపాధ్యాయుడు వేధించిన ఘటనపై రాజేంద్రనగర్ మండలం విద్యాశాఖాధికారి రామ్‌రెడ్డి విచారణ చేపట్టారు. సోమవారం ఆయన అత్తాపూర్‌లోని ఎస్ఆర్ డిజి పాఠశాలను సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎనిమిదివ తరగతి విద్యార్థినీని పిఇటి ఉపాధ్యాయుడు వేధించిన సంఘటనపై పాఠశాల యాజమాన్యానికి నోటీసులు ఇచ్చామని తెలిపారు.వ్యాయామ ఉపాధ్యాయుడిని పాఠశాల యాజమాన్యం విధులు నుంచి తొలగించిందని ఆయన తెలియజేశారు. పాఠశాలలోసిసి టివి కెమెరాలు లేవని,కొన్ని మూత్ర శాలలకు తలుపులు సరిగ్గా లేనందున పాఠశాలకు నోటీసులు ఇవ్వటం జరిగిందన్నారు.



ఇర్ఫానా సుల్తానాకు బిఆర్ఎస్ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే కాలేరు

## బిఆర్ఎస్‌లో చేరిన బిజెపి నేతలు

**కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్**

హైదరాబాద్, ఆగస్టు 7,ప్రభాతవార్త: బిజెపి మైనార్టీ మోర్చా సిటీ జనరల్ సెక్రటరీ ఇర్ఫానా సుల్తానా బిఆర్ఎస్‌లో చేరారు. ఈమేరకు సోమవారం గోల్నాకలోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అంబర్‌పేట్ నియోజకవర్గ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆమెకు కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆమెతోపాటు ఆపార్టీలో చేరినవారికి బిఆర్ఎస్ కండువా కప్పారు. సిఎం కెసిఆర్ నాయత్వంలో తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాభివృద్ధికి ఆకర్షితులైన వివిధ పార్టీలకు చెందిన నాయకులు బిఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఈకార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





గద్దర్ పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, జెబిఎస్ వద్ద గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గజ్జెల నాగేశ్, లాస్య నందిత, బిఆర్ఎస్ నేతలు, జెబిఎస్ వద్ద గద్దర్ అంతిమయాత్రకు స్వాగతం పలుకుతూ శ్రద్ధాంజలి ఘటించిన కాంగ్రెస్ నేతలు, ఆర్టీసి ఉద్యోగులు





అంతిమయాత్రలో పాల్గొన్న సత్యం శ్రీరంగం, గద్దర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉమామహేశ్ తదితరులు, గద్దర్ పార్థీవదేహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే మాధవరం





గద్దర్ పార్థివ దేహం వద్ద నివాళులు అర్పించిన మర్రి, గద్దర్ పార్థివ దేహానికి నివాళులర్పించి మాట్లాడుతున్న డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, గద్దర్ అంతిమయాత్రలో పాల్గొన్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

# విప్లవ వీరుడికి నగరం అంతిమ వీడ్కోలు

**గద్దర్ మృతి తెలంగాణకు తీరనిలోటు**
**డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి**

**తార్నాక..** ప్రజాగాయకులు గద్దర్ లేని లోటు తెలంగాణకు తీరనిలోటని నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి పేర్కొన్నారు. ఎల్‌బీస్టేడియంలో దివంగత గద్దర్ బౌతిక కాయానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మోతె శోభన్ రెడ్డితో కలిసి నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి కలుగాలని పేర్కొన్నారు. ఆయన రాష్ట్రానికి చేసిన సేవలు ఎంతో గొప్పవన్నారు.

**గద్దర్ మృతి తెలంగాణకు తీరనిలోటు : లాస్య నందిత**

**కంటోన్మెంట్..** ప్రజాయుద్ధ నౌక గద్దర్ మృతి చెందడం పట్ల తెలంగాణ సమాజానికి తీరనిలోటు ఏర్పడిందని ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్లు గజ్జెల నాగేశ్, మన్నెక్రిషాంక్, డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మాజీ కారో ్ప్రేటర్, దివంగత ఎమ్మెల్యే సాయన్నకూతుర్లు లాస్య నందిత, నివేదితలు తెలిపారు. సోమవారం సికింద్రాబాద్ జెబిఎస్ వద్ద గద్ ్దర్ అంతిమ యాత్రకు స్వాగతం పలుకుతూ ఆయన బౌతికాయానికి పుష్ప గుచ్ఛాలు అందజేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ మాజీ కో-అప ్షన్ సభ్యుడు నరి ్సంహ్మా ముదిరాజ్, మాజీ బోర్డు సభ్యులు నళిని కిరణ్, లోకనాథ్, శ్యామ్ కుమార్, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టీ.ఎన్.శ్రీనివాస్, డైరెక్టర్లు బత్తుల నారాయణ, దేవుల పల్లి శ్రీను, భాస్కర్ ముదిరాజ్, బిఆర్ఎస్ నాయకులు తేజ్‌పాల్, పనస సంతోష్, దాసరి కర్ణకుమార్, సదానంద్ గౌడ్, ఉమా శంకర్, మురళీ యాదవ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం గద్దర్ అంతిమయాత్రలో పాల్గొని అల్వాల్‌లోని గద్దర్ నివాసానికి తరలివెళ్లి నివాళులర్పించారు.

**గద్దర్‌కు నివాళులర్పించిన కాంగ్రెస్ నేతలు,ఆర్టీసి ఉద్యోగులు**

ప్రజా గాయకుడు గద్దర్ మృతి చెందడం పట్ల కంటోన్మెంట్ కాంగ్రెస్ నేత డి.బి.దేవేందర్, ఆర్టీసి ఉద్యోగ సంఘం నాయకులు లాలయ్య, రాజయ్య నాయక్, రాములు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం ఎల్బీస్టేడియం నుంచి జెబిఎస్ మీదుగా తరలివెళ్తున్న గద్ధర్ అంతిమ యాత్రకు స్వాగతం పలుకుతూ ఆయన బౌతికాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆర్.డి.నాగేశ్ యాదవ్, డి.బాబురావ్, నంది కంటి రవి పాల్గొన్నారు.

**గద్దర్ మరణం బాధాకరం**
**టిపిసిసి అధికార ప్రతినిధి డా. సత్యంశ్రీరంగం**

**కెపిహెచ్‌బి కాలనీ..** ప్రజా గాయకులు గద్దర్ మృతి తెలంగాణ పీడిత, తాడిత ప్రజలకు తీరలిలోటు అని పిసిసి సభ్యులు డా.సత్యంశ్రీరంగం పేర్కొన్నారు. ప్రజా గాయకుడు ప్రజా యుద్దనౌక, తాడిత పీడిత ప్రజల కోసం తన గళాన్ని వినిపించిన ప్రజా గాయకుడు గద్దర్ మరణానికి సంతాపం తెలిపి, ములుగు ఎమ్మెల్యే సీతక్కతో కలిసి సత్యశ్రీరంగం అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా గాయకుడు, ప్రజాయుద్దనౌక, తన గలంతో, గాత్రంతో తెలంగాణ ప్రజల గుండెల్లో విప్లవాగ్ని రగిల్చిన విప్లవ కెరటం, మలిదశ ఉద్యమం ఉవ్వెత్తున నడుస్తున్న సమయంలో ప్రజల పక్షాణ తెలంగాణ పాట అయ్యి, గొంతెత్తి పాడిన ఉద్యమ కెరటం గద్దర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తూము వేణు, బాలాజీనగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణరాజ్‌పుత్ తదితరులు పాల్గొన్నారు.

**గద్దర్ మృతి ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు**

**జగద్గిరిగుట్ట..** ప్రజాయుద్దనౌక గద్దర్ మృతికి సంతాపంగా జగద్గిరిగుట్టలో సిపిఐ, ప్రజానాట్యమండలి, జర్నలిస్టుల ఆద్వర్యంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ తన గళం ద్వారా అనేక మందిని ఉద్యమాల వైపు మళ్ళించి అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించి నిత్యం పేదప్రజల సమస్యలను పాటల రూపంలో జనంలో వెళ్ళిన గొప్ప కళాకారుడు గద్దర్ అన్నారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గం కార్యదర్శి ఉమామహేష్, ప్రజానాట్య మండలి అధ్యక్షులు ప్రవీణ్, జర్నలిస్టులు రామస్వామి, వెంకట్, నర్సింగ్, శంకర్, సిపిఐ మండల సహాయ కార్యదర్శి దుర్గయ్య, నాయకులు సహదేవ్‌రెడ్డి, రాములు, సోమన్న, ఇమామ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

**ప్రజా గాయకుడు గద్దర్ పార్థివదేహానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే మాధవరం**

**కెపిహెచ్‌బి కాలనీ..** ప్రజా గాయకుడు యుద్దనౌక గద్దర్ మృతి చెందిన విషయాన్ని తెలుసుకుని కూకట్‌పల్లి శాసనసభ్యులు మాధవరం కృష్ణారావు గద్దర్ పార్థివ దేహానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్దర్‌తో సంబంధం ఆయనకు 30 సంవత్సరాలుగా ఉందని ఇప్పటికీ కూడా తరచూ ఆయినన కలుస్తానని ఆయన మరణం తీరనిలోటని అన్నారు. మా తండ్రి చనిపోయినప్పుడు ఎంత బాధ అనిపించిందో గద్దర్ మరణ వార్త విన్నప్పుడు అంతే బాధ అనిపించిందని ఆయన సజీవంగా మన మధ్య లేకపోయినా ఆయన పాట ద్వారా ఎప్పుడు మనతోనే ఉంటారని ఆయన జ్ఞాపకాలను మాధవరం కృష్ణారావు గుర్తు చేసుకున్నారు.

**గద్దర్ వంటి ప్రజా గాయకుడిని కోల్పోవడం బాధాకరం: బీజేపీ నాయకులు మర్రి శశిధరరెడ్డి**

**బేగంపేట..** ప్రజా యుద్ద నౌక,ప్రజా గాయకులు గద్దర్ అకాల మరణం చెందడం,అలాంటి ప్రజా గాయకుడిని కోల్పోవడం బాధాకరంగా ఉందని మాజీ ఎన్ డి ఎమ్ ఏ ఉపాధ్యక్షులు, బీజేపీ నాయకులు మర్రి శశిధరరెడ్డి అన్నారు.ఎల్‌బిస్టేడియంలో గద్దర్ పార్థివ దేహాన్ని సందర్శించిన మర్రి ఆయనకు పూల మాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గద్దర్ తెలంగాణా రాష్ట్ర ప్రజల మనసులలో చిరస్థాయిగా నిల్చి ఉంటారని,తెలంగాణా ఉద్యమంలో ఆయన కృషి మరువలేనిదని ఆయన కొనియాడారు.వారి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసారు.

**పీడితజన పాటకు ప్రాణప్రతిష్ట చేసిన గద్దర్**
**తెలంగాణ బిసి కమిషన్ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు**

**రవీంద్రభారతి..** సమాజంలోని బడుగు బలహీనవర్గాలు, నిమ్న, సంచార జాతులు, కులాలకు సమానంగా హక్కులు లభించాలని బతికున్నంతకాలం పీడిత జన పాటలకు ప్రాణప్రతిష్ట చేసి ఆ పాటను ఆయుధంగా మలచి ఉద్యమ జీవితం గడిపిన ప్రజాగాయకుడు, ప్రజా యుద్ధనౌక గద్దర్ అస్తమయం అన్నివర్గాలకు తీరని పూడ్చలేని లోటని, ఆయన మరణం దిగ్భ్రాంతికి లోనుచేసిందని తెలంగాణ రాష్ట్ర బిసి కమిషన్ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణమోహన్‌రావు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర పోరాటంలో గద్దర్ గాత్రం ప్రజలను చైతన్యవంతుల్ని చేసి సమరోత్సాహంతో ఉద్యమంవైపు కార్యోన్ముకులను చేసిందని అన్నారు.

**గద్దర్ అంతిమయాత్రలో పాల్గొన్న మంత్రి**

**సికింద్రాబాద్..** విప్లవ కవి, ప్రజా గాయకుడు గద్దర్‌కు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వీడ్కోలు పలికారు. ఆదివారం మరణించిన గద్దర్ అంతిమ యాత్ర ఎల్‌బీ స్టేడియం నుండి ప్రారంభం అయి సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని బైబిల్ హౌజ్ వద్దకు చేరుకోగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో అంతిమ యాత్రలో పాల్గొని గద్దర్ అమర్‌రహే అంటూ నినాదాలు చేశారు. గద్దర్ భార్య విమలను పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సికింద్రాబాద్ పార్ల మెంట్ బీఆర్ఎస్ ఇంచార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, పద్మారావునగర్ ఇంచార్జి పవన్‌కుమార్ గౌడ్, బన్సీలాల్‌పేట్ అధ్యక్షుడు వెంకటేష్‌రాజు, తలసాని ధరంయదవ్, స్కైలాబ్ యాదవ్, శ్రీహరి, నాగులు, ప్రేమ్, రమణ, ఈరీఫ్‌లు పాల్గొన్నారు.

**గద్దర్‌కు ఎఐటియుసి ఘన నివాళి**

**సైఫాబాద్..** ప్రజా గాయకుడు గద్దర్ అకాల మరణం పట్ల ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర సమితి ప్రగాఢ సంతాపం వ్యక్తం చేసింది. సోమవారం సత్యనారాయణరెడ్డి భవన్‌లో ఆయన చిత్రపటానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.ఎస్.బోస్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, స్టాలిన్ తదితరులు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గద్దర్ పీడిత ప్రజల హక్కుల కోసం తన వాగ్ధాటితో, పాటలతో ఎన్నో పోరాటాలు చేశారని, విప్లవ సాహిత్యం, ప్రజా కళలు, తెలంగాణ సంస్కృతి అంటే గద్దరని వారు కొనియాడారు.

**లోక్‌దళ్ పార్టీ కార్యాలయంలో ఘన నివాళి**

ప్రజా యుద్ధనౌక గద్దర్ మరణం తెలుగు ప్రజలకు, పీడిత, తాడిత ప్రజలకు తీరని లోటని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకట రాజేశ్వర్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. గద్దర్ తన ఆట పాటల ద్వారా ప్రజలను చైతన్యవంతం చేశారని, ప్రశ్నించే తత్వాన్ని నేర్పారని, ఎంతో మంది కళాకారులకు ఆదర్శంగా నిలిచారని ఆయన కొనియాడారు. సోమవారం పార్టీ కార్యాలయంలో గద్దర్ చిత్రపటానికి రాజేశ్వర్‌రావు నివాళులు అర్పించి మాట్లాడారు. గద్దర్ మళ్ళీ జన్మించాలని పీడిత ప్రజల అకాంక్షలు నేరవేర్చాలని ఆయన వేడుకున్నారు. గద్దర్ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

**గద్దర్‌కు ప్రజా సంఘాలు నివాళి**

**సైఫాబాద్..** ప్రజా గాయకుడు గద్దర్ అకాల మరణం పట్ల ఆనేక ప్రజా సంఘాలకు చెందిన వేలాది మంది నాయకులు, కార్యకర్తలు సోమవారం ఎల్‌బి స్టేడియంలో ఆయన భౌతికకాయన్ని సందర్శించి ఘనంగా శ్రద్దాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. గద్దర్ చేసిన సేవలను వారు కొనియాడారు. గద్దర్ మృతి ప్రజా సంఘాలకు, పేద ప్రజలకు, కళాకారులకు తీరని లోటని కొనియాడారు. శ్రద్ధాంజలి ఘటించిన వారిలో తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటి (టి-జెఎసి) చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ సలహాదారులు టి.పద్మారావు, జి.శంకర్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్, నాయకులు వడాల భాస్కర్, ఇందిరా, గద్దె శ్రీనివాస్, ప్రముఖ కవి, గాయకుడు యశ్‌పాల్, బహుజన కవి కదిరే క్రిష్ణ తదితరులు ఉన్నారు.

## జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు మంజారు చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి, ఆగష్టు 7 ప్రభాతవార్త : జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు,హెల్త్ కార్డులు మంజారు చేయాలని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజేంద్రనగర్‌లోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద సోమవారం రాజేంద్రనగర్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు,హెల్త్ కార్డులను ప్రభుత్వం వెంటనే మంజారు చేయాలని తెలిపారు.మరణించిన జర్నలిస్టుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్,బిజెపి,కాంగ్రెస్ నాయకులతో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

## మత్స్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయండి

**మత్స్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం నాయకుల విజ్ఞప్తి**



బండ ప్రకాష్‌కు వినతి పత్రం అందజేస్తున్న మత్స్య శాఖ కాంట్రాక్ట్ ఉద్యోగులు

ధర్నాచౌక్, ఆగస్టు 7, ప్రభాతవార్త: మత్స్యశాఖలో చాలా కాలంగా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని మత్స్యశాఖ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం వారు తెలంగాణ శాసన మండలి డిప్యూటి చైర్మన్ బండ ప్రకాష్‌ను కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న తమ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలని కోరారు. సంఘం అధ్యక్షులు పి.రమేష్, కార్యదర్శి యేసుదాసు, ఉపాధ్యక్షులు ఎన్.కిరణ్, సభ్యులు సీహెచ్ పూర్ణచందర్, కే.సీ.భవ్యశ్రీ, ఏ.శ్రీకన్య పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై ఎస్ఓటి పోలీసుల దాడి

కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్ట్ 7, ప్రభాతవార్త : కెపిహెచ్‌బి పోలీస్ స్టేషన్ పరిధిలోని అడ్డగుట్ట సొసైటీలో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఎస్ఓటి పోలీసులు దాడి చేశారు. కెపిహెచ్‌బి కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడ్డగుట్ట కాలనీ బాలాజీ బాయ్స్ ప్లాట్ నెంబర్ 68/ఏ హాస్టల్‌లో పేకాట ఆడుతున్నట్లు విశ్వశనీయ సమాచారం ప్రకారం దాడులు నిర్వహించి ఆరుగురిని అరెస్ట్ చేశారు. వారినుండి 24వేల రూపాయల నగదు, 6సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

## బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ ముస్లీం గ్రేవ్‌యార్డు నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేస్తాం

**మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్**



ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో గ్రేవ్ యార్డు పనులను పరిశీలించి అధికారులకు సూచనలిస్తున్న మంత్రి తలసాని

బేగంపేట ఆగస్టు 7, ప్రభాతవార్త : సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో ముస్లీం గ్రేవ్‌యార్డ్ నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు. సోమవారం ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ సమీపంలో గ్రేవ్ యార్డుకు కేటాయించిన స్థలాన్ని మంత్రి వివిధ శాఖల అధికారులతో కలిసి సందర్శించారు. ఆ స్థలంలో శిధిలావస్థలో ఉన్న భవనాన్ని కూడా వీలైనంత త్వరగా తొలగించాలని,లెవలింగ్ పనులను వీలైనంత త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ముస్లీంలు ఎవరైనా మరణిస్తే అంత్యక్రియలు నిర్వహించేందుకు పడుతున్న ఇబ్బందులను స్థానిక కార్పోరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి తన దృష్టికి తీసుకు రావడంతో వారి ఇబ్బందులను తాను ముఖ్యమంత్రి, మంత్రి కెటిఆర్ దృష్టికి తీసికెళ్ళడం జరిగిందన్నారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న ఈ సమస్యను దూరం చేయాలనే ఆలోచనతోనే ప్రభుత్వం 2ఎకరాల భూమిని కేటాయించడంతో పాటు నిర్మాణ పనుల కోసం సుమారు 3కోట్ల రూపాయలను మంజూరు చేసినట్లు చెప్పారు.నిర్మా ణ పనులు ఇప్పటికే ప్రారంభం అయ్యాయని, అన్ని సౌకర్యాలతో గ్రేవ్‌యార్డును నిర్మించి ఇస్తామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి వెంట కార్పోరేటర్ టి.మహేశ్వరి శ్రీహరి, ఈఈ సుదర్శన్,వాటర్‌వర్క్స్ సీజీఎం ప్రభు, బీఆర్ఎస్ నాయకులు టి.శ్రీహరి,నరేందర్‌రావు నాయి, బస్తీవాసులు తదితరులు ఉన్నారు.



గృహలక్ష్మీ పథకం కౌంటర్‌ను ప్రారంభిస్తున్న కమిషనర్ సత్యనారాయణరావు

## గృహలక్ష్మీ పథకం ప్రత్యేక కౌంటర్ ప్రారంభం

దుండిగల్, ఆగస్టు 7 ప్రభాతవార్త : దుండిగల్ పురపాలిక సంఘం కార్యాలయంలోని పౌరసేవాకేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన గృహలక్ష్మీ పథకం ప్రత్యేక కౌంటర్‌ను కమిషనర్ సత్యనారాయణరావు ప్రారంభించారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 10వ తేది వరకు ధరఖాస్తులు స్వీకరణ, 20వ తేది వరకు ధరఖాస్తుల పరిశీలన జరుగుతుందన్నారు. అర్హులైన వారికి 25వ తేది వరకు మంజూరు ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఈపథకం కింద ధరఖాస్తు చేసుకునే వారు ఖాళీస్థలం లేదా రేకుల ఇల్లు, ఫుడ్ సెక్యూరిటీకార్డు కలిగి ఉండాలన్నారు. జివో59 లబ్దిదారులు అనర్హులుగా పరిగణిస్తారు. జివో ఎంఎస్ఎస్ నంబర్.25 నిబంధనలకు లోబడి ప్రక్రియ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో మేనేజర్ నర్సింహులు, రెవిన్యూ ఆఫీసర్ సునంద, సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ లోక్‌అదాలత్‌పై పోలీసు ఉన్నతాధికారులతో సమావేశం

నాంపల్లి, ఆగస్టు 7 ప్రభాతవార్త : దేశవ్యాప్తంగా సెప్టెంబరు 9 శనివారం జరుగనున్న జాతీయ లోక్ అదాలత్‌పై మెట్రో పాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్‌జడ్జి రాధికా జైశ్వాల్ సోమవారం పోలీసు ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాబోయే లోక్‌అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని, వారి వారి పోలీసు స్టేషన్ల పరిధిలోని పోలీసు సిబ్బందితో విస్తృతస్థాయిలో సమావేశాలు నిర్వహించి లోక్‌అదాలత్ పైన కక్షిదారులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని, అంతేకాక లోక్‌అదాలత్ ఉపయోగాలు, లోక్‌అదాలత్‌లో రాజీ అవ్వడం వల్ల కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు అర్థమయ్యేరీతిలో సవివరంగా విశదీకరించాలని, ప్రతీఒక్కరూ ఈ లోక్‌అదాలత్‌లో అధికసంఖ్యలో కేసులు పరిష్కారమ య్యేలా తమవంతు కృషిచేయాలని రాధిక జైశ్వాల్ కోరారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ అరవిందకుమార్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## బిసి జాగృతి ఆధ్వర్యంలో ఘనంగా మండల్ డే వేడుకలు



బిపిమండల్ చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న కె.పి మురళీకృష్ణ, ఆనంద్‌గౌడ్, లింగంగౌడ్ తదితరులు

హైదరాబాద్, ఆగస్టు 7,ప్రభాతవార్త: తెలంగాణ బిసి జాగృతి ఆధ్వర్యంలో సోమవారం నల్లకుంట కోరంటి చౌరస్తాలో మండల్‌డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బిపిమండల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం బిసి జాగృతి అధ్యక్షులు కె.పి మురళీకృష్ణ మాట్లాడుతూ 1990లో భారతపార్లమెంట్‌లో బిసి ఉద్యోగులకు 27శాతం రిజర్వేష్లు కల్పించాలని ఆమోద ముద్ర వేయడంలో బిపిమండల్ కృషి గొప్పదన్నారు. అప్పటి రాష్ట్ర పతి జ్ఞాన్‌జైల్‌సింగ్‌కుజాతీయ బిసి కమిషన్ చైర్మన్‌గా బిపిమండల్ 41 సిఫార్సులను అందించడం జరిగిందన్నారు. కావున మండల్ కమిషన్ సిఫార్సులను బిజెపి ప్రభుత్వం అమల్లోకి తీసుకురావాలని కోరారు. గందమల్ల ఆనంద్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ లింగంగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అచ్చిని రమేష్, రాష్ట్ర కార్యదర్శి పాతకోటి మహేష్, మీడియా సెల్ కన్వీనర్ కిరణ్‌కుమార్ యాదవ్, పల్లె వెంకట్‌గౌడ్, మేదరి సంఘం ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ పాల్గొన్నారు.

## శ్రీమహాలక్ష్మీ, నవచండీ యాగం



మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో మహాపూర్ణాహుతి చేస్తున్న సొసైటీ మాజీ అధ్యక్షులు, భక్తులు

యూసుఫ్‌గూడ, ఆగస్టు 7, ప్రభాతవార్త : లోక కళ్యాణార్థం మోతీనగర్ కమ్యూనిటీ హాల్‌లో శ్రీమహాలక్ష్మీ యాగం, నవచండీ మహాయాగం, మహాయాగము, మహారుద్రయాగం, శ్రౌత యాగంతో పాటు చివరిరోజు అయిన సోమవారం మహా పూర్ణాహుతిని ఘనంగా నిర్వహించారు. భరద్వాజ శ్రీవిద్యాపీఠము వ్యవస్థాపకులు అధ్యక్షులు విష్ణుభట్ల లక్ష్మీ నరసింహాశర్మచే ఈయాగాలను నిర్వహించారు. మోతీనగర్ కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ మాజీ అధ్యక్షులు ఎన్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ విశేష హోమాలలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమంనిర్వహించారు.

## చెరువుల ఆక్రమణలపై చర్యలు చేపట్టండి

**కలెక్టర్‌ను కోరిన ఎన్ఎంసి బిజెపి శ్రేణులు**

నిజాంపేట, ఆగస్టు 7 ప్రభాతవార్త: నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చెరువుల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎన్ఎంసి భాజపా అధ్యక్షులు ఆకుల సతీష్ జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ఎంసి పరిధిలోని కొమటికుంట, పెద్దచెరువు, పత్తికుంట తదితర చెరువుల ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్లు, నాలాలను ఆక్రమించి రియల్ సంస్థలు బహుళ అంతస్థులు కొనసాగిస్తున్నారన్నారు. ఈ విషయమై రెవెన్యూ, హెచ్ఎండిఎ, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదులు చేసిన చుట్టపుచూపుకు వచ్చినట్లు సందర్శించి వెళ్ళారు. ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం వెనుక అంతర్యం ఏమిటో అన్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపి ఆక్రమించిన వారిపై వారికి సహకరించిన అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రసాద్‌రాజు, మాధవరావు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

**డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్**



డిప్యూటీమేయర్‌కు సమస్యలు వివరిస్తున్న ఇందిరమ్మకాలనీవాసులు

నిజాంపేట, ఆగస్టు 7 ప్రభాతవార్త : నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్, 13వ డివిజన్ పరిధిలోని ఇందిరమ్మకాలనీ ఫేజ్-1కు చెందిన కాలనీవాసులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్‌ను ఆయన నివాసంలో కలిసి విన్నవించారు. ఈవిషయమై స్పందించిన ఆయన కాలనీలో నెలకొన్న సమస్యలను సంబంధితశాఖ అధికారులతో మాట్లాడి త్వరితంగా పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో రమేష్, యాదగిరి, చంద్రయ్య, శేఖర్, సుభాష్, మల్లేష్, సిద్దయ్య, రవి, సంజీవ్‌కుమార్, బోడస్ రమేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

## క్రమశిక్షణ మండలి నియామకం



విద్యార్థులతో స్కూల్ ఎండి వంశీక్రిష్ణారెడ్డి

జీడిమెట్ల, ఆగస్టు 7 ప్రభాతవార్త : సుభాష్‌నగర్ డివిజన్ పరిధి ఎస్సార్‌నాయక్‌నగర్‌లోని సత్యవాణి విద్యానికేతన్ పాఠశాలలో సోమవారం విద్యార్థుల క్రమశిక్షణమండలి నియామకం జరిగింది. ఈకార్యక్రమానికి టివిఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఎండి వంశీక్రిష్ణా రెడ్డి, సిడబ్ల్యుసి చైర్‌పర్సన్ ఎ.ఎం.రాజారెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరైయ్యారు. ఈసందర్భంగా హెడ్‌బాయ్, హెడ్‌గర్ల్, సిసిఎ బాయ్, సిసిఎ గర్ల్, స్పోర్ట్స్ కెప్టెన్స్‌లను బ్యాడ్జెస్ అందజేసిన అనంతరం అతిథులు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండే నాయకత్వ లక్షణాలను అందిపుచ్చుకోవాలన్నారు. చక్కటి క్రమశిక్షణ, దృఢసంకల్పం, మానవతా విలువలు పెంపొందించుకోవాలని, ప్రస్తుత సమాజంలో మెలుకువలు ఎంతో అవసరమని, విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తును పునాదులు వేసుకునేలా తయారవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పిఇటీలు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

దుండిగల్, ఆగస్టు 7 ప్రభాతవార్త : విద్యుత్ తీగలకు అడ్డుతగులుతున్న చెట్ల కొమ్మలను తొలగించడంలో భాగంగా బహదూర్‌పల్లి, దొమ్మరపోచంపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం(08-08-2023)రోజు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సురేందర్‌రెడ్డి ఒ ప్రకటనలో పేర్కొన్నారు. 11కెవి బహదూర్‌పల్లి, ఐడిఎ2 ఫీడర్‌ల పరిధిలోని సాయినాథ్‌సొసైటీ, బహదూర్‌పల్లి ఎక్స్ రోడ్స్, ఐడిఎ2 ఇండస్ట్రీయల్ ఏరియా ప్రాంతాలలో ఉదయం 9గంల నుండి మధ్యాహ్నం 1గంల వరకు, 11కెవి టెక్‌మహీంద్రా, మిల్లినీయం ఫీడర్‌ల పరిధిలోని బాలాజీనగర్ ఇండస్ట్రీయల్ ఏరియా, కుమ్మరిబస్తీ, శ్రీరామ్‌నగర్‌గడ్డ, గాయత్రి అపార్ట్‌మెంట్స్, ఎస్‌బివికె ఫంక్షన్‌హాల్, ఇండస్ట్రీయల్ ఏరియా తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2గంల నుండి సాయంత్రం 5గంల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. సమస్యను గుర్తించి వినియోగదారులు తమతో సహకరించాల్సిందిగా ఏఈ కోరారు.

## డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



డ్రైనేజి పనులకు శంకుస్థాపన చేస్తున్న చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్

కొంపల్లి, ఆగస్టు 7 ప్రభాతవార్త : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, కొంపల్లి మున్సిపాలిటీ పరిధి 8వవార్డులోని జయభేరి పార్కులో రూ,5లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న భూగర్భ డ్రైనేజీ పనులకు సోమవారం చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా వార్డులలో ప్రజావసరాలకు అనుగుణంగా మౌళికవసతులు కల్పించేందుకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీహరి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం

**మంత్రి శ్రీనివాస్‌యాదవ్**



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

సంజీవరెడ్డి నగర్, ఆగస్ట్ 7, ప్రభాతవార్త : ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలన్ని పరిష్కరించి విద్యార్థులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌లు పేర్కొన్నారు. సోమవారం సనత్‌నగర్‌లోని ఆశోక్ కాలనీలో గల ప్రభుత్వ పాఠశాలను మంత్రులు సందర్శించి పాఠశాలలోని సమస్యలను, ఇబ్బందుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల మంత్రి శ్రీనివాస్‌యాదవ్ పాఠశాలను సందర్శించిన సందర్భంగా పలు అంశాలను సిబ్బంది, విద్యార్థులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో స్పందించిన మంత్రి 2,3 రోజుల్లో విద్యాశాఖ మంత్రి, ఉన్నతాధికారులతో కలిసి పాఠశాలను సందర్శించి అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామి ఇచ్చారు. అందులో భాగంగా విద్యాశాఖమంత్రి సబితా ఇంద్రారెడ్డి, టిఎస్ఈడబ్ల్యూఐడిసి చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి, విద్యాశాఖ ఆర్‌జెడి విజయలక్ష్మి, జేడి ప్రసాద్, అదనపు కలెక్టర్ అభిషేక్, జిల్లా విద్యాశాఖ అధికారి విజయ కుమారిలతో కలిసి పాఠశాలను సందర్శించారు. ఈ పాఠశాలలోని తెలుగు, ఉర్దూ మీడియం ఉన్నత ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు విద్యార్థులు మాట్లాడారు. రుచికరమైన, నాణ్యమైన భోజనం అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలన్ లక్ష్మీబాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంఈఓ ఆంజనేయులు, వాటర్‌వర్క్స్ జిఎం హరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## మండల్ సిఫారసులను దేశవ్యాప్తంగా వెంటనే అమలు చేయాలి

**బిసి సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్‌గౌడ్**



సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్‌గౌడ్ తదితరులు

హైదరాబాద్, ఆగస్టు 7,ప్రభాతవార్త: మండల్ కమిషన్ సిఫార్సులను కేంద్రప్రభుత్వం దేశవ్యాప్తంగా వెంటనే అమలు చేయాలని బిసి సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షులు మేకపోతుల నరేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో "మండల్ కమిషన్ రిజర్వేషన్లు -ప్రస్తుతం బిసిల పరిస్థితి "అనేఅంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. దీనికి వివిధ రాజకీయ, సామాజిక సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈసందర్భంగా నరేందర్‌గౌడ్ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్లకోసం మొదటిసారిగా కాకా కాలేల్కర్ కమిషన్ నియమించిన తర్వాత దేశవ్యాప్తంగా 1978లో బిసి మండల్ సమక్షంలో 2వ బిసి కమిషన్ "మండల్ కమిషన్ "పేరుతో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. బిసి మండల్ దేశవ్యాప్తంగా పర్యటించి అనతికాలంలోనే ఓబిసిల స్థితిగతులపై సిఫార్సులను రాష్ట్రపతికి సమర్పించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో బత్తుల సిద్దేశ్వర్లు, హిందూ బిసి మహాసభ జాతీయ అధ్యక్షులు, తెలంగాణ బిసి సంక్షేమసంఘం వర్కింగ్ ప్రెసిడెంట్, బొల్లం లింగమూర్తి, ముద్దగోని సతీష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర కార్యదర్శి, గిరగాని బిక్షంగౌడ్, పోగుల సైదులుగౌడ్, అబ్బగోని అశోక్‌గౌడ్, షేక్ అన్వర్ దూదేకుల, మట్ట రాజుయాదవ్, వినయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వంలో విలీనం ద్వారా ఆర్టీసి కార్మికుల కష్టాలు తీరుతాయి

**ఆర్టీసి తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.థామస్‌రెడ్డి**

చిక్కడపల్లి, ఆగస్టు 7 ప్రభాతవార్త: కార్మికుల క్షేమంకోసం ఇచ్చిన మాటప్రకారం సిఎం కెసిఆర్ ఆర్టీసి విలీనం బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టడం పట్ల ఆర్టీసి తెలంగాణ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.థామస్‌రెడ్డి, ముఖ్యనాయకులు అధ్యక్షుడు ఎఆర్.రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కమలాకర్‌గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో విలేకరులతో మాట్లాడారు. బిల్లును పరిశీలించి కార్మికుల శ్రేయస్సును విచారించి తదుపరి అసెంబ్లీ చర్యలకు ఆమోదం తెలిపిన గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆర్టీసి సమస్యలు కెసిఆర్‌కు ఎంతో ఓర్పుగా, సవివరంగా వివరించి మెప్పించిన మంత్రి కెటిఆర్‌కు, ఆర్థిక శాఖ మంత్రి హరీష్‌రావు, రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్, ఆర్టీసి చైర్మన్ బాజిరెడ్డి గోవర్దన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఏర్పాటు నుంచి ఆర్టీసి సంస్థకు ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా అన్నిటికీ ఆదుకొని అండగా నిలిచిన ధీరోదాత్తుడు కెసిఆర్ అని, సకలజనుల సమ్మెలో కార్మికుల త్యాగానికి ప్రతిగా నేడు ఆర్టీసి వీలినం ప్రతిపాదించి ఆర్టీసి కార్మికుల గౌరవాన్ని నిలబెట్టిన అభిమానదనుడు కెసిఆర్ అని అన్నారు. ఈ కార్యక్రమంలో సలహాదారు బి.యాదయ్య, ముఖ్యసలహాదారు ఎల్.మారన్న, కోశాధికారి రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్హులంతా ఓటరు నమోదు చేయించుకోవాలి : రామకృష్ణారెడ్డి



మణికొండ చిత్రపురి కాలనీలో ప్రారంభమైన ఓటరు నమోదు

నార్సింగి, ఆగస్టు 7 ప్రభాతవార్త : 18.ఏళ్ల వయసున్న ప్రతీ ఒక్కరూ తమ ఓటును నమోదు చేయించుకోవాలని మణికొండ మున్సిపల్ బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మణికొండ చిత్రపురి కాలనీలో ఓటరు నమోదు సెంటర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ రాజ్యాంగం మనకు ఓటు హక్కును కల్పించిందని, దీన్ని ప్రతీ ఒక్కరూ పొంది, ఉపయోగించుకోవాలన్నారు. 18.సంవత్సరాల వయసు వచ్చిన ప్రతీ ఒక్కరూ తమకు దగ్గరలో ఉన్న సెంటర్ల వద్దకు వెళ్లి ఆధార్‌కార్డు/పదో తరగతి మెమో/జనన ధృవీకరణ పత్రాలను చూపిస్తే అక్కడి అధికారులు ఓటరు నమోదు చేయిస్తారని తెలిపారు. ఈ ఓటరు కార్డు ఉంటేనే మన పాలకులను మనం ఎంపిక చేసుకునే అవకాశం మనకు దక్కుతుందన్నారు. పని చేసే వారికి ఓటు వేసి గెలిపించుకోవడం, పని చేయని వారికి ఓటుతో పోటు పొడవం సాధ్యపడుతుందని రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ అధ్యక్షులు శ్రీరాములు, కౌన్సిలర్ వసంత్ కుమార్ చౌహాన్, నాయకులు శ్రావణ్, కుమార్, గంగాధర్, రాజేంద్రప్రసాద్, రాజు, రమణమూర్తి, నాగమధు, రామమూర్తి, శ్రీనివాస్‌రావ్, మల్లిఖార్జున్, లక్ష్మయ్య, కిరణ్, విజయలక్ష్మీ, శివగంగ, లక్ష్మీశ్రీ, సరోజిని, సురేఖ, స్పందన, సింధు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఎప్పటికి ఆదరణ



ఎర్రగడ్డలో పాదయాత్ర చేస్తున్న జూబ్లిహిల్స్ నియోజకవర్గం మాజీ శాసన సభ్యులు పి.విష్ణువర్ధన్‌రెడ్డి

యూసుఫ్‌గూడ, ఆగస్టు 7, ప్రభాతవార్త : కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో ఎప్పటికి ఆదరణ ఉందని జూబ్లిహిల్స్ మాజీ శాసన సభ్యులు పి. విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. ఎర్రగడ్డలో పెద్ద ఎత్తున నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో పాదయాత్ర నిర్వహించారు. దీనిలో క్యాంపెనింగ్ కమిటి చైర్మన్ మధుయాష్కి, టిపిసిసి మైనార్టీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ షేక్ అబ్దుల్ సొహెల్, ఓబిసి చైర్మన్ నుత్తి శ్రీకాంత్, ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్‌బలరామ్ లతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ప్రజలు అడుగడుగున హారతులు పడుతూ వారిని అశీర్వదించారు. ప్రజా సమస్యలను వాటికోసం అహర్నిశలు కృషిచేసే పార్టీ కాంగ్రెస్ పార్టీయే అనీ గతంలో తాము నియోజకవర్గంలో అన్ని విధాల అబివృద్ది కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని గుర్తుచేశారు. కర్ణాటకలో మాదిరిగానే తెలంగాణలో కూడా రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కాయమని పేర్కొన్నారు.

## పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేసిన అవయం ట్రస్ట్

అడ్డగుట్ట, ఆగస్టు 7 ప్రభాతవార్త: సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా అవయం చారిటబుల్‌ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో చదువుతున్న 1200 మంది బాలికలకు చారోన్ నోటుపుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్వల్ సంస్థ ప్రతినిధులను అభినందించారు. ఈ సందర్భంగా అవయం చారిటబుల్‌ట్రస్ట్ సురేశ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల సహకారంతో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుంటాం

బేగంబజార్, ఆగస్టు 7,ప్రభాతవార్త: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజల సహకారంతో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకుంటామని గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు తమ ధీమా వ్యక్తం చేశారు. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులలో ఎవరికి ఇచ్చిన తాము కలిసి కట్టుగా ప్రజలతో సహకారంతో విజయం సాధిస్తామన్నారు. జాంబాగ్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మధు సూధన్ గుప్త, కాంగ్రెస్ ఏ బ్లాక్ అధ్యక్షులు సికె.మూర్తి, బి.బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు డి.రూపేష్‌సింగ్, గోకరన్‌సింగ్, రామ్‌రాజ్ సింగ్, ఆర్. నరేందర్, సంజయ్ యాదవ్, కైలాష్‌సింగ్, నిర్మల్‌కుమార్ యాదవ్, కన్నయ్యలాల్ సాహు, కేవల్‌సింగ్, అశోక్, శ్యామ్‌సింగ్ పలువురు కాం గ్రెస్ నాయకులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ

## ఉద్యోగులు, పెన్షనర్లపై సిఎం వ్యాఖ్యలను స్వాగతిస్తున్నాం

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం**

హైదరాబాద్, ఆగస్టు 7,ప్రభాతవార్త: సిఎం కెసిఆర్ ఉద్యోగులకు, పెన్షనర్ల పై అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలను తాము స్వాగతిస్తున్నామని 2వ పిఆర్‌సిని నియమించి ఐఆర్ కూడా దేశంలోనే అత్యధికంగా ఇస్తామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నాని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (బడిచౌడి) రాష్ట్ర అధ్యక్షులు జి.దామోదర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ పి.చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. సిఎం కెసిఆర్ పరిపాలనలో ఉద్యోగులకు, పెన్షనర్ల సమస్యలన్నీ పరిష్కరిస్తారనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నామన్నారు. ముఖ్యం టగా పెన్షనర్ల ఆరోగ్యకార్డు (ఈహెచ్ఎస్), కమ్యూ టేషన్ రికవరీ కాలాన్ని 15ఏళ్ల నుంచి 12 సంవత్సరాలుకు తగ్గించడం వంటి సమస్యలను కూడా పరిష్కరిస్తారని, మిగతా చిన్న సమస్యలను అధికారులు పెన్షనర్ల సంఘ నాయకులతో చర్చించి చర్యలు తీసుకుంటారని తాము విశ్వాసంతో ఉన్నామని పేర్కొన్నారు.

## నల్లపోచమ్మ దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు



అఫ్జల్‌గంజ్, ఆగస్టు 7,ప్రభాతవార్త: గోషామహల్ నియోజకవర్గం దత్తాత్రేయ నగర్ డివిజన్‌లో మాజీ గ్రంథాలయ చైర్మన్ బిఆర్ఎస్ నాయకులు,గడ్డం గంగాధర్ ఫౌండేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో నటరాజ్ కాలనిలో తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ సారథ్యంలో చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఆర్‌టిసి ప్రభుత్వంలో వీలినం చేయడం, రైతులకు 19000వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేయడాన్ని ప్రజలకు వివరించారు. ఈసందర్భంగా నల్లపోచమ్మ దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

## చేనేత పద్మశాలీలకు అండగా సీఎం కేసీఆర్

**కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్**



మంత్రి కేటీఆర్‌కు పూల మొక్కను అందజేస్తున్న స్టాండింగ్ కమిటీ మెంబర్ సాయిజన్ శేఖర్, చిత్రంలో బీఎల్ఆర్

నాచారం, ఆగస్టు 7 ప్రభాతవార్త: చేనేత పద్మశాలీలకు అండగా సీఎం కేసీఆర్ ఉండి అనేక విధాలుగా వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారని నాచారం కార్పోరేటర్ శాంతి సాయిజన్ శేఖర్ పేర్కొన్నారు. చేనేత భవన్ శంకుస్థాపనకు ముఖ్య అతిలుగా హాజరైన మంత్రి కేటీఆర్‌ను కార్పోరేటర్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. తాను పద్మశాలి చేనేత బిడ్డగా కృతజ్ఞతలు తెలియజేయడం జరిగిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేనేత బిడ్డలను ఆదుకోలేదని వారికి బీఆర్ఎస్ ప్రభుత్వం అండగా ఉండటం తమకు ఎంతో సంతోషాన్ని కల్గిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు బండారి లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సాయిజన్ శేఖర్ పాల్గొన్నారు.

## ఆస్పత్రిలో నర్సుల సేవలు వెలకట్టలేనివి

**నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప**



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ బీరప్ప

హైదరాబాద్, ఆగస్టు 7,ప్రభాతవార్త: ఆస్పత్రిలో నర్సులసేవలు వెలకట్టలేనివని నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప అన్నారు. వైద్యులు ఒకరోగితో పదినిమిషాలు ఇంటరాక్షన్ అయితే నర్సులు అడ్మిషన్ నుంచి డిశ్చార్జ్‌వరకు ఇంటరాక్షన్ ఉంటుందన్నారు. ఈమేరకు సోమవారం నిమ్స్ ఆసుపత్రి ఎమర్జెన్సీ బిల్డింగ్ 5వ అంతస్తులోని ఆడిటోరియంలో "రోల్ ఆఫ్ నర్సింగ్ కేర్ ఇన్ పేషెంట్ "పేరుతో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈసందర్భంగా బీరప్పమాట్లాడుతూ బయట ఆసుపత్రులతో పోల్చుకుంటే నిమ్స్‌లో ఉన్న నర్సులో ఎంతో వేగంగా సేవలు అందిస్తున్నారని నర్సులకు రోగులకు మధ్య ఏమోషనల్ సపోర్టు ఉంటుందన్నారు. కొంతమంది జూనియర్ నర్సులు రోగికి ఏదైనా సమస్య వచ్చినప్పుడు వైద్యులు అడిగేందుకు భయపడుతున్నారని ,వార్డుల్లో ఉన్నప్పుడు తాము నర్సులం కాదు.. డాక్టర్లమేనన్న కాన్ఫిడెంట్ ఉండాలని సూచించారు. ఆసుపత్రిలో వర్క్‌లోడ్ ఎక్కువవుతుందని అయినా సేవలు వేగంగా అందిస్తున్నారన్నారు. నిరంతరం రోగుల సేవలో ఉండే నర్సులు కూడా తమ వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్దపెట్టాలని, వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నర్సుల్లో మరిన్ని నైపుణ్యాలు పెంచేందుకు శిక్షణ సదస్సులను నిర్వహించి అవగాహన కల్పిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఆస్పత్రి డీన్ లీజా రాజశేఖర్, అసోసియేట్ డీన్ నాగేశ్వర్‌రావు, డిప్యూటీ మెడికల్ సూపరిడెంట్ లక్ష్మీభాస్కర్, నెఫ్రాలజీ విభాగాధిపతి స్వర్ణలత, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ ద్రాక్షాయని, వివిధ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

యూసుఫ్‌గూడ, ఆగస్టు 7, ప్రభాతవార్త : బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లకు ఎస్సార్‌నగర్ ఏసిపి వై.వెంకటేశ్వరరావు కౌన్సిలింగ్ ఇచ్చారు. రౌడీ షీటర్లు అందరూ సత్ప్రవర్తనతో మెలగాలని 10సంవత్సరాలు ఎలాంటి క్రిమినల్ కేసులు లేకుండా ఉన్నవారిపై సీట్లను తొలగించేందుకు పరిశీలిస్తున్నామన్నారు. అదేవిధంగా బోరబండ ప్రాంతంలో ఈమధ్య కాలంలో కేసులు నమోదు అయిన వ్యక్తులపైన నూతన రౌడీ షీట్లు తెరవాలని ఇన్స్‌పెక్టర్‌ని ఆదేశించారు. ఈకార్యక్రమంలో బోరబండ ఇన్స్‌పెక్టర్ కమల్ల రవికుమార్, ఎస్సైలు జమాల్, మనోజ్ పాల్గొన్నారు.

## 10వ తేదీ అర్ధరాత్రి నుంచి రవాణా రంగ వాహనాలు బంద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్. దయానంద్

సైఫాబాద్, ఆగస్టు 7 ప్రభాతవార్త: రాష్ట్రంలోని రవాణా రంగ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 10వ తేదీ నుంచి అన్ని రకాల రవాణా రంగ వాహనాల బంద్ నిర్వహిస్తున్నామని తెలంగాణ రవాణా రంగ కార్మికుల ఐక్య సమితి హెచ్చరించింది. ఈ బంద్ ఈ నెల 10వ తేదీ అర్ధరాత్రి నుంచి 24 గంటల పాటు కొనసాగుతుందని, అప్పటికి ప్రభుత్వం స్పందించి చర్చలకు ఆహ్వానించకపోతే ప్రగతి భవన్‌ను ముట్టడిస్తామని ఐక్య సమితి తెలిపింది. ఈ మేరకు సోమవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి కన్వీనర్ ఎస్.దయానంద్, ప్రతినిధులు రామకృష్ణారెడ్డి, రాజశేఖర్, మల్లేష్‌గౌడ్, టి.శంకర్, మహ్మద్ సలావుద్దీన్ తదితరులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రవాణా రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. కార్మికుల సంక్షేమ కోసం బోర్డును ఏర్పాటు చేయాలని, హైదరాబాద్ నగరంలో ఆటోలకు కొత్త పర్మిట్లను మంజూరు చేయాలని, లారీలకు సింగల్ పర్మిట్ విధానం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఓలా, ఉబర్, ర్యాపిడక్ష లాంటి అగ్రిగేటెడ్ కంపెనీలను రద్దు చేసి రవాణా రంగానికి ప్రత్యేక యాప్ తీసుకురావాలని, పెంచిన ఆర్‌టిఎ, గ్రీన్ ట్యాక్స్‌లను రద్దు చేయాలని, చార్జీలను తగ్గించాలని, డ్రైవర్ లైసెన్స్‌పై ప్రస్తుతం వున్న ఐదు లక్షల రూపాయల ప్రమాద బీమాను సాధారణ మరణం పొందినవారికి కూడా వర్తింపజేయాలని, పెట్రోల్, డిజీల్‌ను జిఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని, ఆటో మీటర్ చార్జీలను పెంచాలని వారు కోరారు.

## ట్రాఫిక్‌పై చిన్ననాటి నుంచే అవగాహన కలిగి ఉండాలి

**టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు**



బేగంపేట టీటీఐలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులకు ట్రాఫిక్ పై అవగాహన కల్పిస్తున్న టీటీఐ ఏసీపీ శంకర్‌రాజు

బేగంపేట ఆగస్టు 7,ప్రభాతవార్త : విద్యార్థులు (ప్రాథమిక స్థాయి) నుంచే ట్రాఫిక్ పై అవగాహన కల్గి ఉండాలని బేగంపేట ట్రాఫిక్ ట్రయినింగ్ ఇనిసిట్యూట్ ఏసీపీ జి.శంకర్ రాజు అన్నారు. సోమవారం బేగంపేట టీటీఐ హీరో పార్కులో 4వ తరగతి విద్యార్థులు, మరియూ బేగంపేటలోని ఓ ప్రయివేటు పాఠశాల సిబ్బందికి ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ పై అవగాహన కల్గి ఉండాలని, ట్రాఫిక్ నిబందనలను ఖచ్చితంగా పాటించాలని కోరారు. ముఖ్యంగా మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని వారి తల్లి దండ్రులకు ఆయన సూచించారు. అలా ఎవరైనా వాహనాలు ఇచ్చినట్లైతే వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన తెలియజేసారు. ట్రాఫిక్ లో ప్రయాణించే సమయంలో ముఖ్యంగా సిగ్నల్స్ పాటించాలన్నారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తూ ఎంతో మంది యువత ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బేగంపేట ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ జి.సంజీవ్ విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఎల్లయ్య బస్తీలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు

**గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్**



సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ పావనీ వినయకుమార్

చిక్కడపల్లి, ఆగస్టు 7 ప్రభాతవార్త: గాంధీనగర్ డివిజన్‌లోని ఎల్లయ్య బస్తీలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్ తెలిపారు. సోమవారం డివిజన్‌లోని ఎల్లయ్య బస్తీతో పాటు ఇతర ప్రాంతాలలో బిజెవైఎం పూర్వ జిల్లా అధ్యక్షుడు ఎ.వినయకుమార్, వాటర్‌బోర్డు డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్, ఇర్కి ఇన్‌స్పెక్టర్ శంకర్, జగన్‌తో కలిసి పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, స్థానిక ప్రజల అభ్యర్థనల మేరకు అవసరమైతే సీవరేజ్ పైప్‌లైన్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక బస్తీ నాయకులు, బిజెపి నేతలు పాల్గొన్నారు.

## సీతారామంజనేయ స్వామి వెంకటేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీ ఏర్పాటు



జవహార్‌నగర్‌లోని శ్రీసీతారామంజనేయ స్వామి వెంకటేశ్వరస్వామి ఆలయ నూతన కమిటీని అభినందిస్తున్న కార్పొరేటర్ దేదిప్యరావు

యూసుఫ్‌గూడ, ఆగస్టు 7, ప్రభాతవార్త : వెంగళరావునగర్ డివిజన్ పరిదిలోని జవహార్‌నగర్‌లో శ్రీసీతారామంజనేయస్వామి, వెంకటేశ్వరస్వామి దేవాలయ అభివృద్ది కమిటీని డివిజన్ కార్పోరేటర్ దేదిప్య రావు ప్రకటించారు. ఆలయ కమిటి అధ్యక్షులుగా గజ్జల బాలకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.అశోక్, ప్రధాన కార్యదర్శిగా ఎన్ రాజు రజక, ఉపాధ్యక్షులుగా పూజారి బాలరాజు, సత్యనారాయయణ, నాగాయాదవ్, కోశాదికారిగా ఓమ్‌ప్రకాష్, సంయుక్త కార్యదర్శిగా శివకుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా విజయ్‌గౌడ్, రమేష్, పోలీస్ బాలయ్య, రాజమ్మ, లత, బాలశక్తి, పబ్లిసిటీ సెక్రటరీగా బాలురజక, కుమార్ నాయక్, కమిటి సభ్యులుగా వినోద్, బాలు, నాని, లక్ష్మీగౌడ్, శ్రావణి, గంగ, నిర్మల, రమ్య తదితరులను నియమించారు. ఈసందర్భంగా కార్పోరేటర్ మాట్లాడుతూ ఆలయ అభివృద్దికి స్థానిక శాసన సభ్యులు మాగంటి గోపినాథ్ సహాయ సహకారాల తో పండుగ పర్వదినాలను ఆలయాలను మరింత అభివృద్ది పరచడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షులు వేణుగోపాల్ యాదవ్, జిటియస్ దేవాలయం చైర్మన్ చిన్నరమేష్, మాజీ కార్పోరేటర్ శ్యామ్‌రావు, వేణు, పవన్ ముదిరాజ్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి : కార్పొరేటర్ వెంకటేష్



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్

ఫిల్మ్‌నగర్, ఆగస్ట్ 7, ప్రభాతవార్త : సీసీ రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తూచా తప్పకుండా పాటించాలని, వర్షాకాలం దృష్ట్యా అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ పేర్కొన్నారు. సోమవారం జూబ్లీహిల్స్ డివిజన్ బాబానాయుడు నగర్‌లో 24లక్షల రూపాయల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ బాబునాయుడు నగర్‌లో ఇప్పటికే అనేక చోట్ల నూతన సీసీ రోడ్డు ఏర్పాటు చేశాన్నారు. ప్రజల అవసరాల మేరకు అవసరమైన ప్రతి చోట నూతన సీసీ రోడ్డు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిహెచ్ఎంసి డిపార్ట్‌మెంట్ అధికారులు ఏఈ వెంకటేష్, వాటర్‌వర్క్స్ మేనేజర్ పవన్, జిహెచ్ఎంసి ఎస్ఎఫ్ఏ సూపర్వైజర్ మహేందర్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక బస్తీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో జాతీయ చేనేత దినోత్సవం

కెపిహెచ్‌బి కాలనీ, ఆగస్టు 7, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర పురపాలక మున్సిపల్ శాఖమంత్రి కెటిఆర్ ఆదేశా మేరకు, శేరిలింగంపల్లి ప్రభుత్వవిప్ అరికెపూడి గాంధీ పిలుపు మేరకు జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా డివిజన్ పరిధిలోని ప్రధాన రహదారిలో ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి డివిజన్ కార్పోరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ చేనేత కార్మికులతో కలిసి పూలమాలవేసి నేతన్నలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నేతలన్నలు నిర్వహించిన బైక్ ర్యాలీని కార్పోరేటర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పోరేటర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సిఎం కెసిఆర్ మార్గ నిర్దేశనంలో చేనేత కార్మికుల సంక్షేమం, ఉపాది కోసం అనేక కార్యక్రమాలను చేపట్టారని అన్నారు. చేనేత వృత్తిపై ఆధారపడిన నేతన్నలను గుర్తిస్తూ, వారి మగ్గాలను జియో ట్యాగ్ చేయడం, చేనేత మిత్ర, నేతన్నలకు రుణమాఫీ వంటి అనేక చేనేత అభివృద్ధి సంక్షేమం కొరకు వినూత్న పథకాలను ప్రవేశపెట్టి దేశానికి ఆదర్శంగా నిలిచామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సమ్మారెడ్డి, ప్రకాష్, పద్మయ్య పాల్గొన్నారు.

## తెలంగాణలో క్రీడాభివృద్ధిపై చర్చ

హైదరాబాద్, ఆగస్టు 7,ప్రభాతవార్త: రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడాశాఖ కార్యదర్శిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సీనియర్ ఐఏఎస్ అధికారిణి శైలజా రామయ్యర్‌ను జాతీయ హ్యాండ్‌బాల్ సంఘం (హెచ్ఏఐ) ప్రధాన కార్యదర్శి అర్శనపల్లి జగన్మోహన్‌రావు మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం సచివాలయంలోని క్రీడాశాఖ కార్యాలయంలో ఆమెను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సమర్థవంతమైన ఆమె నాయత్వంలో రాష్ట్రంలో క్రీడలు మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా వచ్చే అక్టోబరులో గోవాలో జరగనున్న నేషనల్ గేమ్స్‌కు హ్యాండ్‌బాల్ సంఘం తరపున ఆమెను జగన్మోహన్‌రావు ఆహ్వానించారు. భవిష్యత్‌లో రాష్ట్రంలో జాతీయ క్రీడలు నిర్వహించేందుకు బిడ్ దాఖలు చేసే విషయంతోపాటు ,రాష్ట్రంలో క్రీడా ప్రగతికి తీసుకోవాల్సిన అంశాలపై కూడా సెక్రటరీతో చర్చించారు.

## వైన్ మార్టులో అక్రమంగా సిట్టింగ్ ఏర్పాటు చేయిస్తున్నారు

యూసుఫ్‌గూడ, ఆగస్టు 7, ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వ ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ నిబంధనలను అతిక్రమించి 18సంవత్సరాలలోపు పిల్లలకు మద్యం అమ్మడంతో పాటు వైన్ మార్టులో అక్రమంగా సిట్టింగ్ ఏర్పాటు చేయిస్తున్నారని వైన్ మార్టును వెంటనే సీజ్ చేయాలంటూ టియమ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు వెంకటేష్ మాదిగ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నగరంలోని జూబ్లిహిల్స్ నియోజకవర్గం ఫీలిం నగర్‌లో వైన్‌మార్ట్‌లో కల్తీ మందు అమ్మకాలతో పాటు యద్దేచ్ఛగా బహిరంగంగా మద్యాన్ని సరఫరా చేస్తున్నారని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని మూసివేయాలని డిమాండ్ చేశారు. ఈవైన్ మార్టులలో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేవని తప్పుడు పత్రాలతో పర్మిట్ రూంలు నిర్మిస్తున్నారని అటువంటి వారిని గుర్తించి ఎక్సైజ్ శాఖ అధికారులు జిల్లా కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## అమ్మవారిని వేడుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయి : బండ కార్తీక

అడ్డగుట్ట, ఆగస్టు7 ప్రభాతవార్త: అమ్మవారిని వేడుకుంటే కోరుకున్న కోర్కెలు నెరవేరుతాయని గ్రేటర్ మాజీ మేయర్ బండ కార్తీక రెడ్డి తెలిపారు. బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం రాత్రి అడ్డగుట్టలోని శాందార్‌బాయ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన పలహారం బండి ఊరేగింపులో ఆమె పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వినోద్ గౌడ్, ఎసాగర్, మనోజ్, నరేశ్, రాము పాల్గొన్నారు.



అడ్డగుట్ట పలహారం బండి ఊరేగింపులో పాల్గొన్న గ్రేటర్ మాజీ మేయర్ బండ కార్తీక రెడ్డి తదితరులు

వార్త VAARTHA CLASSIFIEDS

LOSS OF PASSPORT

★ I, SOPHIA KUMAR D/o. SANGEET KUMAR, R/o. F.No.105, Kubera Tower, Trimulgherry, Sec'bad, T.S. While I Am Cleaning My House I Lost My Passport No. T9317195. If Found Plz. Cont: 9014615525.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవసలిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.

## చేనేతల సంక్షేమానికి నేతన్న భీమా పథకం : ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



జెండావిష్కరణ చేసి వందన సమర్పణ చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తదితరులు

**వనస్థలిపురం, ఆగస్టు 7 ప్రభాతవార్త:** జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ అనంతవేణినగర్‌కాలనీలో శ్రీ భావన ఋషీదేవ చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఆవిష్కరణ గావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత వస్త్రాలను ఆదరిద్దాం. నేతన్నల జీవితాల్లో కొత్త వెలుగులు నింపుదామని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు భీమా మాదిరిగానే నేతన్నల సంక్షేమానికి నేతన్న భీమాపేరుతో పథకాన్ని అమలు చేస్తుందన్నారు. ఈ పథకం క్రింద నమోదైన నేతన్నలు మరణిస్తే వారి కుటుంబానికి రూ.5లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందన్నారు. మే 2023 నాటికి 18 నుండి 59 ఏండ్ల వయసు కలిగిన 35,999 మంది నేతన్నలు ఈ పథకానికి అర్హత కలిగి ఉన్నారని, మే 2023 నాటికి మరణించిన 79 మంది నేతన్నల కుటుంబాల కు రూ.3.95కోట్లను ప్రభుత్వం చెల్లించిందన్నారు. రాబోయే రోజుల్లో చేనేత కార్మికులకు ఎన్నో సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ భారాస అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, పోగుల రాంబాబు, సతీష్, రాఘవేంద్రరావు, రాజుయాదవ్ నిర్వాహకులు రాపోలు తిరుమలేష, కిరాందాస్ నర్సింహా, సత్యనారాయణ, నర్సింహా, విజయలక్ష్మి, సూర్యకళ, శ్రీరంగం తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమానికి గద్దర్ కృషి : కొమిరెల్లి

**మలక్‌పేట, ఆగస్టు 7 ప్రభాతవార్త:** జన గాయకుడు సమాజ స్వప్నికుడిగా పేరొందిన వ్యక్తి గద్దర్ అని డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. అనంతరం గద్దర్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ పేద బడుగు బలహీన, అణగారిన వర్గాల అడుగంటిన సామాన్యుల కోసం అహర్నిశలు ఆయన గానంతో ఉత్తేజపరిచి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని కొనియాడారు ఈ కార్యక్రమంలో గ్రేటర్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బాబు శ్రీనివాస్, నాయకులు విష్ణుదేవ్, గడ్డం నరేందర్, మహేష్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## దళితులను బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలే మోసం చేస్తున్నాయి: అందెల

**సరూర్‌నగర్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ దావూద్‌ఖాన్‌గూడ సర్వే నెంబర్ 2లో దశాబ్దాలుగా వ్యవసాయం చేసిన రైతులను బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలే మోసం చేశాయని మహేశ్వరం నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్ ఆరోపించారు. సోమవారం ఆయన దావూద్‌ఖాన్‌గూడకు వచ్చి దీక్ష చేస్తున్న రైతు కుటుంబాలను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దాదాపు 70 సంవత్సరాలుగా ఇక్కడిభూముల్లో వ్యవసాయం చేసిన దళిత రైతులకు కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతలే అన్యాయం చేశారని అన్నారు. అయితే మిగులు భూమి కోసం ఆందోళన చేస్తున్న దళితుల విషయమై అసెంబ్లీలో బిజెపి ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ మాట్లాడే ప్రయత్నంచేస్తే మైక్ కట్‌చేశారని ఆయన విమర్శించారు. దళితులకు అండగా బిజెపి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నడికుడ యాదగిరి, చిత్రం శ్రీనివాస్, తోట శ్రీధర్‌రెడ్డి, దడిగ శంకర్, కార్పొరేటర్లు గౌర రమాదేవిశ్రీనివాస్, సునీతా శ్రీకాంత్‌గౌడ్, రామిడి మాధురీ వీరకర్ణారెడ్డి, గడ్డం లక్ష్మారెడ్డితో పాటు మద్ది రాజశేఖర్‌రెడ్డి, రామిడి శూరకర్ణారెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గద్దర్ మృతి తీరని లోటు: తీగల విక్రంరెడ్డి

**సరూర్‌నగర్, ప్రభాతవార్త:** ప్రజా గాయకుడు గద్దర్ మృతి తీరని లోటని మీర్‌పేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి అన్నారు. ప్రశాంతి హిల్స్ చౌరస్తాలో కార్పొరేటర్ ధనలక్ష్మి రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గద్దర్ సంతాప కార్యక్రమానికి ఆయన హాజరై గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

## ఈస్ట్ ఆనంద్ భాగ్ డివిజన్ హైదర్‌నగర్‌లో ఘనంగా మొహర్రం పర్వదిన వేడుకలు



ప్రార్థనలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి, కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

**మల్కాజిగిరి, ఆగస్టు 7 ప్రభాతవార్త:** ఈస్ట్ ఆనంద్ భాగ్ డివిజన్ పరిధిలోని హైదర్‌నగర్‌లో మొహరం పర్వదిన వేడుకలు పురస్కరించుకుని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్‌లు స్థానిక మసీదులో ప్రత్యేక పార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జితేంద్ర నాథ్, జీఎన్‌వి సతీష్‌కుమార్, గుండా నిరంజన్, ఎస్ఆర్.ప్రసాద్, బాబు, సత్యనారాయణ, సంతోష్ రాందాస్, ఉపేందర్, ఖరార్‌బాయ్, మజీద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## మోహన్‌నగర్‌లో ఘనంగా బోనాల జాతర

**ఎల్.బి.నగర్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లో బోనాల జాతర భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మోహన్‌నగర్‌లో యష్పల్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాలు, తొట్టెల కార్యక్రమంలో బిజెపి జాతీయ నాయకులు మురళిధర్‌రావు, కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ పాల్గొని పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు తీసుకోనీ అందరికీ బోనాలు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మురళీధర్‌రావు పవన్‌కుమార్‌లను నిర్వాహకుడు యశ్పాల్‌గౌడ్ శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



సిసి రోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ తదితరులు

**సైదాబాద్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అనా ్నరు. డివిజన్‌లోని కళ్యాణ్‌నగర్‌లో సిసి రోడ్డు నిర్మాణ పనులు పరిశీలించిన అనంతర ం కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్‌లో జరిగే అన్ని అభివృద్ధి పనుల్లో ప్రభుత్వ నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలను తప్పని సరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఇ వెంకన్న, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాజ్ కుమార్, చందు, స్వాతి, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల భూములంటే ప్రభుత్వ జాగీరా? : పాలకుల తీరుపై కోదండరాం ఫైర్



భూబాధిత రైతుల పట్ల ప్రభుత్వ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న కోదండరాం

**సరూర్‌నగర్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** రైతుల భూములంటే ఏమైనా ప్రభుత్వ జాగీరా?.. భూ సేకరణకు ఇష్టారాజ్యంగా జిఓలు, నోటిఫికేషన్లు జారీ చేసి రైతులను, ప్రైవేటుప్లాట్ల యజమానులను ఆందోళనకు గురి చేస్తారా? అంటూ తెలంగాణ జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ధ్వజమెత్తారు. హార్డ్‌వేర్ పార్కు కోసం చాలా సంవత్సరాల క్రితం జారీ చేసిన జిఓను రద్దు చేయాలనే డిమాండ్‌తో బాలాపూర్ మండలంలోని నాదర్‌గుల్, ఇబ్రహీంపట్నం మండలంలోని ఆదిభట్ల, అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని ఎంఎంకుంట గ్రామాలకు చెందిన పలువురు రైతులతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన ఇక్కడి భూముల్లో ప్లాట్లు ఉన్న వారు ఏర్పాటు చేసుకున్న హార్డ్‌వేర్ వ్యతిరేక పోరాట కమిటీ సోమవారం తలపెట్టిన మహా పాదయాత్ర నేపథ్యంలో ప్రొఫెసర్ కోదండరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా నాదర్‌గుల్ సమీపంలోని బద్దం మల్లారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ హార్డ్‌వేర్ భూబాధిత రైతులు, ప్లాట్ల యజమానులు ఎట్టి పరిస్థితుల్లో తమ భూములను, ప్లాట్లను వదులుకోవద్దనీ ఆందోళనలను సీరియస్‌గా చేయాలని సూచించారు. హార్డ్‌వేర వ్యతిరేక పోరాట కమిటీ చేసే ఆందోళనలకు తమ మద్దతు, సహకారం తప్పకుండా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. చాలా సంవత్సరాల క్రితం హార్డ్‌వేర్ పార్కు కోసం జారీ చేసిన నోటిఫికేషన్లు, జిఓలు నిబంధనలు, చట్టం ప్రకారం చెల్లవని ఆయన తేల్చి చెప్పారు. ఏ రూల్ ప్రకారం వెళ్ళినా ఇక్కడి భూములు రైతులవేననీ అదే విధంగా ప్లాట్లు సంబంధిత ఓనర్లవేనని ఆయన అన్నారు. చట్టం, నిబంధనలను పట్టించుకోకుండా టిఎస్ఐఐసి మొండిగా ఉంటే జెఎసి చేయాల్సిన ఆందోళనలు చేయాల్సిందేనని ఆయన తెలిపారు. ప్రభుత్వ తీరు చూస్తుంటే కంచే చేను మేస్తున్న చందంగా ఉన్నట్లు ఉందని ఆయన విమర్శించారు. సమిష్టిగా పోరాడి భూములను, ప్లాట్లను రక్షించుకోవాలని ఆయన భూబాధిత రైతులకు, ప్లాట్ల యజమానులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెఎసి ఛైర్మన్ మాధవరం రామేశ్వరరావు, కన్వీనర్ కందాడి శ్రీరాంరెడ్డి, టిజెఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దార సత్యం, మాజీ సర్పంచ్ మర్రి హన్మంత్‌రెడ్డి, కళ్లెం చంద్రారెడ్డి, పెత్తుల్ల ఆనంద్‌రెడ్డి, ముద్దం వెంకట్‌రెడ్డి, మర్రి తిరుపతిరెడ్డి, సుధాకర్ యాదవ్, యెల్చల దయాకర్‌రెడ్డి, మెకం దర్శన్, ఏనుగు మోహన్‌రెడ్డిలతో పాటు పలువురు రైతులు, ప్లాట్ల యజమానులు పాల్గొన్నారు.

## ధృఢసంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చు : జూనియర్ సివిల్ జడ్జి ఫరిహా అహ్మద్



జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన ఫరిహా అహ్మద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**మలక్‌పేట, ఆగస్టు 7 ప్రభాతవార్త :** ధృఢ సంకల్పం ఉంటే మహిళలకు అసాధ్యమేదిలేదని జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికైన మహమ్మద్ ఫరీహా అహ్మద్ అన్నారు. సోమవారం మలక్‌పేట్‌లోని డాన్ హైస్కూల్‌లో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో పాల్గొని ఆమె మాట్లాడుతూ తమ లక్ష్య సాధన కోసం విద్యార్థులు చిన్ననాటినుంచే అకుంఠిత దీక్షతో, ఏక లక్ష్యంగా కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ఇందుకు తల్లిదండ్రులతో పాటు, ఉపాధ్యాయుల ప్రోత్సాహంతప్పకుండా ఉండాలని ఆమె సూచించారు. జీవిత లక్ష్యాలను సాధించడానికి ఎన్ని అవాంతరాలు ఎదురైనా వెనుకంజ వేయకుండా ముందుకు సాగాలని సూచించారు. నేటి పోటీ యుగంలో విద్యార్థులు, దేశంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో కూడా పోటీపడేందుకు నిరంతరం సిద్ధంగా ఉండాలని ఆమె విద్యార్థినులకు పిలుపునిచ్చారు. అంతరిక్షం వరకు మహిళలు విజయపథంలో వెళ్తుండటం ఎంతో గర్వకారణమన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు ఆడపిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉందన్నారు. న్యాయరంగానికి సంబంధించి డాన్ హై స్కూల్ విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆమె చక్కగా సమాధానాలు చెబుతూ, విద్యార్థులందరినీ సంతృప్తిపర్చడంతోపాటు న్యాయ వ్యవస్థపైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఛైర్మన్ ఫజ్లుర్ రహ్మాన్ ఖుర్రంతో పాటు సీనియర్ న్యాయ వాది ఇంతియాజ్, మంజూర్, డాక్టర్ గులాం అబ్బాస్, షజీ ఉల్లా ఫిరాసత్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా గాయకుడు గద్దర్‌కు ఘన నివాళులు



హయత్‌నగర్‌లో గద్దర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

**హయత్‌నగర్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** ప్రజాగాయకుడు గద్దర్‌మరణం యావత్ తెలంగాణకు తీరని లోటని తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రరవీందర్,ఉపాధ్యక్షుడు పారందస్వామి అన్నారు. ప్రజా యుద్ధనౌక ప్రజా ఫ్రంట్ పార్టీ వ్యవస్థాపకుడు గద్దర్ మరణాన్ని పురస్కరించుకుని హయత్‌నగర్‌లో నాయకులు సోమవారం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన పాటలతో ప్రజలను చైతన్య పరిచారని తెలిపారు. అనంతరం ఎల్బీస్టేడియం నుంచి కొనసాగిన అంతిమయాత్రలో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు జెనిగె రమేష్, క్యాదాసు సతీష్‌మహారాజు, మల్లేష్, భాస్కర్ పాల్గొన్నారు.

## మహాధర్నాను విజయవంతం చేయాలి

**హయత్‌నగర్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9, 10వ తేదీల్లో శంషాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు సోమవారం పార్టీ అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్ మండల కమిటీల ఆధ్వర్యంలో కుంట్లూర్ గ్రామం రావినారాయణరెడ్డి కాలనీ చౌరస్తాలో వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోడీహయాంలో కార్మిక చట్టాలు అనిచి వేయబడుతున్నాయని, వ్యవసాయ రంగంలో కార్పొరేట్ విధానాన్ని తీసుకువచ్చి సన్న చిన్నకారు రైతులకు తీరని అన్యాయం చేస్తున్నారని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలను అదుపు చేయలేకపోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ కొనసాగించనున్న మహాధర్నాకు పార్టీ శ్రేణులు, సానుభూతిపరులు పెద్దఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సామిడిశేఖర్‌రెడ్డి, హరిసింగ్ నాయక్, శ్రీనివాస్‌సాగర్, నారాయణ, కాశీ, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

## మహేశ్వరం నియోజకవర్గానికి రూ.160.90 కోట్లు విడుదల: మంత్రి

**సరూర్‌నగర్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలో ఇటీవల జరిగిన హరితహారం కార్యక్రమం సందర్భంగా హాజరైన సిఎం కెసిఆర్ నియోజకవర్గానికి ప్రకటించిన నిధుల హామీ కార్యరూపం దాల్చిందని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పట్లోళ్ళ సబితా ఇంద్రారెడ్డి వెల్లడించారు. సిఎం వాగ్దానం నేపథ్యంలో నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం రూ.160.90 కోట్ల నిధులను విడుదల చేసిందని ఆమె తెలిపారు. ఇందులో భాగంగా బడంగ్‌పేట్, మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్లకు రూ.50 కోట్ల చొప్పున రూ.100 కోట్లు, జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీలకు రూ.25 కోట్ల చొప్పున రూ.50 కోట్లు, మహేశ్వరం, కందుకూరు మండలాల్లో ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.15 లక్షల చొప్పున మొత్తం 66 గ్రామాలకు రూ.9.90 కోట్లు మంజూరయ్యారని సబితారెడ్డి వివరించారు. సిఎం కెసిఆర్ చొరవ వల్ల తాజాగా విడుదలైన ఈ నిధులతో నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని ఆమె స్పష్టం చేశారు. హరితహారం సందర్భంగా మొక్కలు నాటడానికి విచ్చేసి నిధుల మంజూరు ప్రకటన చేసి హామీని నిలబెట్టుకున్న కెసిఆర్‌కు ఆమె నియోజకవర్గ ప్రజల తరపున ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సిఎం ఇచ్చిన ప్రోత్సాహం, స్ఫూర్తితో నియోజకవర్గాన్ని అభివృద్ధి, సంక్షేమపరంగా ఇంకా ముందుకు తీసుకుపోతామని సబితా ఇంద్రారెడ్డి అన్నారు.

## నాచారం డివిజన్‌లో వార్డు కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన : ఎమ్మెల్యే బేతి



వార్డు కార్యాలయంకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బేతి, శాంతి శేఖర్

**నాచారం, అగస్టు 7 ప్రభాతవార్త:** నాచారం డివిజన్ పరిధిలో రూ. 78 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేయనున్న నాచారం వార్డు కార్యాలయానికి ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, స్థానిక కార్పొరేటర్ సాయిజన్ శాంతిశేఖర్‌తో కలిసి శంకుస్థాపన, భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధునాతన పద్ధతిలో వార్డు కార్యాయాన్ని నిర్మింపజేసున్నామని, పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులు ఉండేలా అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు సాయిజన్ శేఖర్, కాప్రా డిసి ముకుందరెడ్డి, డిఈ రూప, ఏఈ లింగారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, ముత్యంరెడ్డి, భూపాల్ రెడ్డి, రమణారెడ్డి, కట్ట బుచ్చన్న గౌడ్, అంజి, రమాకృష్ణ, లడ్డు, శివ తదితరులు పాల్గొన్నారు.

## గద్దర్ మృతి బాధాకరం : మేయర్ పారిజాత



గద్దర్‌కు నివాళులర్పిస్తున్న పారిజాత, కాంగ్రెస్ నాయకులు

**సరూర్‌నగర్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్‌లోని బడంగ్‌పేట్ పాత గ్రామ పంచాయతీ చౌరస్తా వద్ద సోమవారం ఉదయం గద్దర్ సంతాప కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన టిపిసిసి ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి గద్దర్ ఫ్లెక్సీ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గద్దర్ మృతి బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్‌రెడ్డి, నేనావత్ బాలు నాయక్, నాయకులు ఎర్ర జైహింద్,రాళ్ళగూడెం శ్రీనివాస్‌రెడ్డి, బాల్‌నింగని జంగయ్య, గట్టు బాలకృష్ణ, పుట్టగళ్ళ జగన్, బంగారు అశోక్, తూళ్ళ నరహరిగౌడ్, మహేశ్వరం నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి

## పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి



లబ్దిదారుడికి చెక్కు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

**ఎల్.బి.నగర్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరమ్మని రాష్ట్ర పర్యాటక శాఖ అభివృద్ధి మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త పేర్కొన్నారు. హయత్‌నగర్ డివిజన్ భాగ్యనగర్‌కాలనీకి చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన పి.రాజేందర్ నడుము ఎముక బొక్కలు అరిగి అనారోగ్య కారణంతో బాధ పడుతుంటే అతని ఆపరేషన్ కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.60వేలు మంజూరు చేయించిన చెక్కును లబ్ధిదారుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేదలకు సీఎం సహాయనిధి అండగా ఉంటుందని అన్నారు. తెలంగాణ ప్రబుత్వం ఎంతో మంది పేద ప్రజలకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. ఆర్థిక స్థోమతలేని వారు ముఖ్యమంత్రి సహాయనిధి అందడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంతో జీవనం సాగిస్తున్నారని అన్నారు.

## మంచి నీరు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలి



కాలనీలలో పర్యటిస్తున్న ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ తదితరులు

**ఎల్.బి.నగర్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** మంచినీరు మురుగునీరు సమస్యలను పరిష్కరించే విధంగా అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని సరూర్ నగర్‌డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. భగత్ సింగ్‌నగర్, డాక్టర్స్‌కాలనీ, వెంకటేశ్వరకాలనీ, లక్ష్మీనగర్ కాలనీలలో జల మండలి పారిశుద్ధ్య విభాగం అధికారులతో కలిసి ఆమె పర్యటించి సమస్యలను పరిశీలించారు. కాలనీలలో మురుగునీరు లీకేజీలు పెరిగిపోయాయని, మంచినీరు లోప్రెజర్ సమస్య ప్రజలను వెంటాడుతోందని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.

## చేనేత శాశ్వత భవన భూమి పూజలో బిఆర్‌ఎస్ నేతల ప్రోటోకాల్ వివాదం



చేనేత భవన పూజ కార్యక్రమంలో నిరసన వ్యక్తం చేస్తున్న బిఆర్‌ఎస్ నేతలు

**ఉప్పల్, ఆగస్టు 7 ప్రభాతవార్త :** ఉప్పల్ మినీ శిల్పారామంలో జాతీయ చేనేత దినోత్సవం పురస్కరించుకుని చేనేత శాశ్వత భవన భూమి పూజ కార్యక్రమంలో ప్రోటోకాల్ వివాదం రేగింది. మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డిల ఫోటోలు ఫ్లెక్సీలో వేయలేదని ఆరోపిస్తూ బిఆర్ఎస్ నేతలు వెంకటేశ్వరరెడ్డి, రఘుపతిరెడ్డి, శివ తదితరులు చేనేత, జౌళి శాఖ అధికారులతో వాగ్వివాదానికి దిగారు. స్థానిక ఎమ్మెల్యే ఫోటో ఎందుకు వేయలేదు, ఫ్లెక్సీ తొలగించి కొత్తది పెట్టాలని డిమాండ్ చేశారు. దీంతో ఉప్పల్ సిఐ గోవిందరెడ్డి జోక్యం చేసుకుని నేతలకు సర్ది చెప్పారు. దీనిపై చేనేత జౌళిశాఖ అధికారులను వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే వ్యవహరించినట్లు తెలిపారు. బిఆర్ఎస్ నేతల ఆందోళనతో కొద్దిసేపు శిలాఫలక వేదిక వద్ద హడావిడి నెలకొంది.

## కార్పొరేట్ ఆసుపత్రికి ధీటుగా మలక్‌పేట ఏరియా ఆసుపత్రి : ఎమ్మెల్యే బలాల



అంబులెన్స్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బలాల తదితరులు

**మలక్‌పేట, ఆగస్టు 7 ప్రభాతవార్త:** కార్పొరేట్ ఆసుపత్రికి ధీటుగా మలక్‌పేట ఏరియా ఆసుపత్రిని తీర్చిదిద్దుతున్నామని ఎమ్మెల్యే బలాల పేర్కొన్నారు. ఏరియా ఆసుపత్రిలో జరిగిన కార్యక్రమలో అంబులెన్స్ వాహనాన్ని, ఐఎంఐ వ్యాక్సినేషన్ సెంటర్‌ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిలో అత్యుత్తమ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ త్రిలోక్‌శ్యాం, కార్పొరేటర్లు మినాజుద్దీన్, సాలం షాహిద్, మలక్‌పేట క్లస్టర్ వైద్యాధికారి డాక్టర్‌బ్రిజున్నీసా, డాక్టర్ తరుణ్, కరుణాకర్, అలీం తదితరులు పాల్గొన్నారు. **కళాశాల నిర్మాణ పనుల పరిశీలన...** చంచల్‌గూడ ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాల నిర్మాణ పనులను ఎమ్మెల్యే బలాల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన ముందస్తు జాగ్రత్తలను తీసుకుంటూ నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు. అదే విధంగా అజంపుర డివిజన్‌లోని కాలడేరాలో కొనసాగుతున్న రోడ్డు నిర్మాణ పనులను ఎమ్మెల్యే బలాల పరిశీలించారు. అదేవిధంగా అభివృద్ధి కార్యక్రమాలగురించి అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధికారులు మల్లికార్జున్, గోవింద్‌రెడ్డి, నాయకులు అబ్రార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఉప్పల్, ఆగస్టు 7 ప్రభాతవార్త :** ఉప్పల్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం విద్యుత్ మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఎఇ సాయికిరణ్‌రెడ్డి తెలిపారు. ఉప్పల్ ఫీడర్ పరిధిలోని లక్ష్మారెడ్డి కాలనీ, రాఘవేంద్రనగర్, హనుమసాయికాలనీ, సూర్యనగర్, విజయపురి కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకు, అదే విధంగా 11కెవి సరస్వతి కాలనీ ఫీడర్ పరిధిలోని సరస్వతి కాలనీ, ఆర్‌టిఏ కార్యాలయం తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

## అవినీతికి అవకాశం లేకుండా అభివృద్ధి : పరమేశ్వర్‌రెడ్డి

**ఉప్పల్, ఆగస్టు 7 ప్రభాతవార్త :** అవినీతికి అవకాశం లేకుండా ఉప్పల్ డివిజన్‌లో అభివృద్ధి సాగుతుందని కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ అధ్యక్షుడు మందముల్ల పరమేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ఉప్పల్ డివిజన్ లక్ష్మీనారాయణకాలనీలో కార్పొరేటర్ ఎం.రజితపరమేశ్వర్‌రెడ్డితో కలిసి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజలతో ఉంటూ పనిచేస్తున్నామని, కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రజా గాయకుడు గద్దర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

## గద్దర్ మృతి బాధాకరం : దేప భాస్కర్‌రెడ్డి



గద్దర్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న దేప భాస్కర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** ప్రజా గాయకుడు, తెలంగాణ ఉద్యమ నేత గద్దర్ మృతి బాధాకరమని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు దేప భాస్కర్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో గద్దర్ పార్థివదేహానికి సోమవారం పూలమాలవేసి నివాళులర్పించారు. గద్దర్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రజాకళలు, జానపదం ఉన్నంతకాలం ప్రజాకవి గద్దర్ పేరు చిరస్థాయిగా నిలిచి ఉంటుందని ప్రజల హృదయాల్లో తన ఆటపాటలతో చైతన్యం రగిలించారని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ బండి మధుసూదన్‌రావు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు నల్లేంకి ధన్‌రాజ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సై ఫలితాల్లో అఖిల మొదటి ర్యాంక్




అఖిలను సన్మానిస్తున్న వెంకట్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** ఎస్సై ఫలితాలలో కే. అఖిల మొదటి ర్యాంకును సాధించినట్లు టాపర్ ఇనిస్ట్యూట్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి తెలిపారు. సివిల్ ఎస్సై మహిళా ఫలితాలలో చైతన్యపురిలోని టాపర్ ఇనిస్టిట్యూట్ విద్యార్థి అఖిల అత్యుత్తమ ర్యాంకును సాధించడంతో సోమవారం ఆమెను వెంకటరెడ్డి శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థి అఖిల మాట్లాడుతూ అధ్యాపకులు ఉత్తమ బోధన ద్వారా తాను ఎంతో శ్రమపడి శ్రద్ధగా చదువుకోవడం వల్లే మొదటి ర్యాంకు సాధించానని తెలిపారు. ఇనిస్ట్యూషన్లో ప్రతిరోజు పరీక్షలు పెట్టడం, సబ్జెక్టుకు సంబంధించి ఎప్పటికప్పుడు నూతన విధానంతో బోధన చేయడం వల్ల ర్యాంకు సాధించగలిగామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.